# జనబలం

ప్రజలే ప్రభువులు

జూలై 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## ఉగ్రవాదంపై తక్షణ స్పందన, దీర్ఘకాలిక పోరాటం

## అమెరికా స్వాతంత్ర్య ప్రకటన @





## 8వ వేతన సంఘం.. ప్రభుత్వ, ప్రైవేటు తేడా

## మూసీ సుందరీకరణ- ప్రపంచ సుందరి పోటీలు



# ఇంకా ఎక్కువ జనాభా అనర్థదాయకం



భారత్‌లో జననాల రేటు పెంచాలని ఇటీవల దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు కొందరు పిలుపునిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రులు చంద్రబాబు, స్టాలిన్.. ఇంకా ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని ప్రజల్ని కోరుతున్నారు. ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాల్నీ ఇస్తున్నారు. కాలక్రమంలో పనిచేసే వయసు జనాభా తగ్గిపోయి, ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుందేమోనని వారి భయం. దానికి తోడు, జాతీయ స్థాయి చట్టసభలో ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనని ఆందోళన. కానీ జనాభా పెరుగుదల వాదన ఎంత ప్రమాదకరమో వాస్తవాల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. 50 ఏళ్ల క్రితం నేను వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడు..నా తరంలోని అనేకమంది యువతకు జనాభా పెరుగుదలపై పీడకలలు వస్తుండేవి. మా భయాలు నిజమని రుజువైంది. ఈవేళ భారతదేశ జనాభా.. 19 వ శతాబ్దంలోని మొత్తం ప్రపంచ జనాభాకు దాదాపు సమానం. నేతలు కోరుతున్నట్లు జనాభా పెరిగితే, ప్రపంచ జనాభా 2,000 కోట్లకు చేరుతుంది. ఇంత విస్ఫోటనాన్ని మానవాళి భరించలేదు. ఇప్పటికే మనం పర్యావరణపరంగా పెనుసవాళ్లను సృష్టించుకున్నాం.

ఇటీవలికాలంలో భారత్‌లోని చాలా రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల అదుపులోకి వచ్చింది. మిగిలిన రాష్ట్రాల్లోనూ తగ్గుతోంది. ఇది ఘనతగా భావించాలి, సంబరంగా జరుపుకోవాలి. సంతానోత్పత్తి రేటు మరీ తగ్గిపోతే, పనిచేసేవారి సంఖ్య పడిపోయి, ఆధారపడేవారి సంఖ్య భవిష్యత్తులో పెరగొచ్చు. కానీ భారత్ అలాంటి స్థితిలో లేదు. సమీప కాలంలో. మన పిల్లలకు ఒక్కటంటే ఒక్క రాష్ట్రంలో కూడా నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాం, నైపుణ్యాల్ని పెంచలేకపోతున్నాం. 80 శాతం మానవ వనరుల్ని వృథా చేస్తూ, ఇంకా పిల్లల్ని కనమనటం ఎంత అర్థరహితం! ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైన తరుణంలో ఇది విపరీత పరిణామాలకు దారితీస్తుంది. ఇంకా పేదరికాన్ని కొనసాగిస్తుంది. దేశాన్ని దివాళా తీయిస్తుంది. కార్మికుల కొరత ఉంటే, అంతర్గత వలసల్లో, ఉత్పాదకత పెంపులో సమాధానం ఉంది. తేలిగ్గా వలసలకు మనం తగిన పరిస్థితుల్ని కల్పించాలి. చిన్న పట్టణాల్ని ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. మనకు విద్య, నైపుణ్యాలు, ఉత్పాదకత, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి కావాలి తప్ప.. మరింత ఎక్కువ జనాభా, దుష్పరిపాలన కాదు.

**– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**
**(జూలై 11, ప్రపంచ జనాభా దినోత్సవం)**

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

జూలై 2025

సంపుటి 26 సంచిక 07



## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*



**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


## కార్టూన్ కార్నర్




ఏం కాదు సార్! ఇది చూసి ఏదో ఒకపార్టీ తర్వాతి ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోదు!!


05 ఉగ్రవాదంపై భారత్ ప్రతిస్పందన, దీర్ఘకాలిక పోరాటం

07 అమెరికా స్వాతంత్ర్య ప్రకటన @ 250

13 మరో మహమ్మారిని ఎదుర్కొనేలా...

21 అంతరాల్ని తగ్గించేలా 8వ వేతన సంఘం సిఫార్సులుండాలి

27 మూసీ సుందరీకరణ, ప్రపంచ సుందరి పోటీలు



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఎడాపెడా అనుమతులిస్తే ఇదే పరిస్థితి

మా పిల్లలు అయితే మెడిసిన్ లేకపోతే ఇంజనీరింగ్ చదవాలన్న తల్లిదండ్రుల బలహీనతను ఆసరా చేసుకొని అనేక మెడికల్ కాలేజీలు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. అలాంటి మెడికల్ కాలేజీలకు సరిపోను వసతులు. అధ్యాపకులు, మెడికల్ కాలేజీకి అను బంధంగా ఉండాల్సిన ఆసుపత్రులకు డాక్టర్లు, ఆ డాక్టర్లు చూడాల్సిన పేషెంట్లు ఉన్నారా? అలా ఉంటేనే అనుమతులు ఇచ్చారా? అని ప్రశ్నించుకుంటే అంతా బోగస్ అని తెలిపోయింది.

డమ్మీ ఫ్యాకల్టీ, డకోటా ప్లాన్స్, నకిలీ పేషెంట్స్...ఫేమస్ కాలేజ్ అంటూ కలరింగ్. అంతా అబద్ధం. అంతా ఫేక్. అందరూ మున్నాబాయ్ ఎంబీబీఎస్‌లే. ఉత్తుత్తి బోధకులతో నకిలీ రోగులను చూపించి మెడికల్ మాఫియా కేటుగాళ్లు అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో అడ్డదారిలో అనుమతులు తెచ్చుకున్న వైద్య కళాశాలలపై సీబీఐ కొరడా ఝుళిపించింది. ఫ్యాకల్టీ లేదు. డాక్టర్లు అంతకంటే లేరు. అద్దె డాక్టర్లు, అద్దె సిబ్బందితో నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులను మభ్యపెట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఢిల్లీ వరకు మెడికల్ కాలేజీ అక్రమాల దందా నడుస్తూనే ఉంది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ స్కామ్‌లో సంచ లన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

మెడికల్ కాలేజీల స్కాంలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 36 మందిపై కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన డాక్టర్ల పాత్రపై కూడా పలు కేసులు నమోదు చేశారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మెడికల్ కాలేజీ తనిఖీలో అక్రమాలు బయటపడ్డాయి. మాజీ యుజీసీ ఛైర్మన్ డీపీసింగ్, స్వయం ప్రకటిత దేవుడిగా చెప్పుకునే రవిశంకర్ మహారాజ్, ఇండోర్ ఇండెక్స్ మెడికల్ కాలేజీకి చెందిన సురేష్ సింగ్ భదోరియా, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఛైర్మన్‌గా పనిచేసిన సంజయ్ శుక్లా పేర్లు తెరపైకి వచ్చాయి.

రవిశంకర్ మహారాజ్ అలియాస్ రావత్‌పురా సర్కార్‌ను ఎఫ్ఐఆర్‌లో చేర్చడంతో బడాబాబుల గుండెల్లో రైళ్లు పరుగె డుతున్నాయి. ఆయనకు పెద్ద పెద్ద రాజకీయ నేతలు, అధికారులతో సంబంధాలు ఉన్నాయి. పవర్ సెంట్రిక్‌గా ఉంటారనే టాక్ ఉంది. అధికారానికి దగ్గరగా ఉన్న బాబా అని చెబుతారు. ఐఏఎస్, ఐపీఎస్‌తో ఆయన ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.రావత్‌పురా వివాదంలో చిక్కుకోవడం తొలిసారేం కాదు. ఆయన ట్రస్ట్ పై భూ ఆక్రమణలు, అనుమతి లేని కళాశాలలను నడపడం, విద్యార్థులను మతపరంగా పాల్గొనమని బలవంతం చేయడం, ఆశ్రమాలలోని మహిళలను మానసికంగా వేధించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. రావత్‌పురా సర్కార్ అవినీతి సామ్రాజ్యానికి అధిపతిగా రాజ్యమేలుతున్నాడు. ఇక మెడికల్ స్కాంలో రహస్య డేటాను పొందిన వారిలో గుర్గావ్‌కు చెందిన వీరేంద్రకుమార్, ద్వారకాకు చెందిన మనీషా జోషి, ఉదయపూర్‌కు చెందిన మయూర్ రావల్ ఉన్నారు. మెడికల్ మాఫియా రాకెట్‌కు కేంద్ర బిందువుగా మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ మాజీ సభ్యుడు జితులాల్ మీనా ఉన్నారు. ఆయనే స్వయంగా మధ్యవర్తిగా వ్యవహరించి లంచాలు సేకరించాడని సీబీఐ ఆరోపించింది.

వైద్య కళాశాలలకు అనుమతులు ఇచ్చేందుకు, ఉన్న వాటిని పునరుద్ధరించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ పరిశీలిస్తుంది. ఇలాంటి విద్యా సంస్థలు దళారుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నాయి. లంచాలు ఎరవేసి అధికారులను లోబర్చుకున్నారని ఇందులో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు చెందిన పూనం మీనా, ధర్మవీర్, పీయూష్ మల్యాన్, అనూప్ జైస్వాల్, రాహుల్ శ్రీవాత్సవ, చందన్‌కుమార్‌లు ఉన్నారని సీబీఐ గుర్తించింది.తెలుగురాష్ట్రాల్లో మెడికల్ స్కాం ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురిపై జూన్ 30న కేసు నమోదు చేసింది. లంచాలు ఇచ్చి మెడికల్ కౌన్సిల్‌ను మేనేజ్ చేసి పర్మిషన్ తెచ్చుకొని మెడికల్ సీట్ల పేరుతో కోట్లు దండుకుంటున్నారు.

ఈ మొత్తం అవినీతి ఎపిసోడ్లో కంచే చేను మేస్తే ఏమవుతుందో మనకు అర్థం అవుతుంది. అనుమతులు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వ స్వయంప్రతిపత్తి సంస్థలే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నాయి. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా కింది నుంచి పై దాకా అందరికీ లంచాలు ముట్టచెప్పాల్సి రావడం దురదృష్టం. ఇందులో మరోకోణం కూడా ఉంది. కొన్ని యాజమాన్యాలు మెడికల్ కాలేజీలను ఎంత చక్కగా నిర్వహించినా, అన్నీ సక్రమంగా ఉన్నా కూడా..లంచాలకు అలవాటు పడిన కొంత మంది అధి.కారులు ఏదో ఒక వంక పెట్టి అనుమతులు నిరాకరిస్తున్నారు. 'అన్ని సక్రమంగా ఉన్నాయి కనుకనే నాకు లంచం ఇవ్వండి' అని ఓ సినిమాలో ట్రాఫిక్ కానిస్టేబుల్ డిమాండ్ చేస్తారు. ఇదీ అలాగే ఉంది. అనుమతుల కోసం లంచాలు ఇవ్వనిదే అనుమతి రావడం లేదు. కొంత మంది లంచాలతోనే సరిపెట్టకుండా..తమ వాంఛలు తీర్చాలని నిసిగ్గుగా అడుగుతున్నారని కొందరు యజమానులు వాపోతున్నారు.

తీగలాగారు.. ఇక డొంక కదలాల్సిందే కానీ పైన ఉన్న రాజకీయ నాయకత్వం తమదాకా వస్తుందని భయపడి సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటుందా?. లేక స్వతంత్రంగా దర్యాప్తు కొనసాగుతోందా? దోషులకు శిక్ష పడుతుందా? వేచి చూడాల్సిందే.

మనకు నాణ్యమైన వైద్యం అందించటానికి ఇప్పటికే ఉన్న డాక్టర్లు, కాలేజీలు చాలు, జిల్లాకో వైద్య కళాశాలతో వైద్య ప్రమాణాల్ని ఇంకా నాసిగా తయారుచేయవద్దని లోక్‌సత్తా వ్యవస్థాపకులు జేపీ ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్న విషయం ఈ సందర్భంగా మనం గమనించాలి.

–బండారు రామ్మోహనరావు

# ఉగ్రవాదంపై భారత్ ప్రతిస్పందన, దీర్ఘకాలిక పోరాటం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -



నిస్సహాయ నిష్క్రియత, రెండు అణ్వస్త్ర దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం..ఈ రెంటికీ మధ్యేమార్గంగా 'ఆపరేషన్ సిందూర్'ని భారత్ నిర్వహించగలిగింది. రెచ్చగొట్టేలా కాకుండా కచ్చితత్వంతో, ఆచితూచి.. అదే సమయంలో చాలా బలంగా, పహల్గాం ఉగ్రరాక్షస దాడికి భారత్ జవాబిచ్చింది. ఈ సైనిక ప్రతిస్పందన పాకిస్థానీ ప్రభుత్వాన్ని కట్టడి చేసే గట్టి హెచ్చరిక కావాలి. ఉగ్రవాదాన్ని పెంచి ప్రోత్సహిస్తున్నవాళ్లు వెనక్కి తగ్గకుండా, ఇదే వినాశకర, స్వీయ విధ్వంసక మార్గంలోనే సాగితే – భారీ మూల్యం చెల్లించక తప్పదని భారత్ రక్షణ దళాలు చేతలతో తెలియ చెప్పాయి.

అమాయకుల్నీ, నిరాయుధుల్ని నిష్కారణంగా ఊచకోత కోసిన ఘోర ఉగ్రవాద దాడి కావటంతో సహజంగానే తీవ్ర ఆగ్రహం, ఆక్రోశం కలుగుతాయి. ఈ భావోద్వేగ తీవ్రత నుంచే మన పౌరుల్లో కొందరు పాకిస్థాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం చేయాలని, శత్రువుని చిత్తుగా ఓడించి విజయం సాధించాలని కోరుకున్నారు. వారి డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

కానీ టెర్రరిజం పట్ల ఆవేశపూరిత ప్రతిస్పందనలు ప్రతికూల ఫలితాలనిస్తాయి. మన భద్రతని మరింత ప్రమాదంలోకి నెడతాయి. 9/11 తర్వాత అమెరికానే చూడండి. గాయపడిన బెబ్బులిలా ఆఫ్ఘనిస్థాన్ను ఆక్రమించింది. ఆ తర్వాత 2003 లో ఇరాక్‌ను జయించింది. రెండు దేశాలనూ సునాయాసంగా అమెరికా వశపరచుకోగలిగింది. కానీ ఏం సాధించింది? శాంతి, చట్టబద్ధపాలనల్ని నెలకొల్ప లేకపోయింది. ఉగ్రవాదాన్ని నిర్మూలించలేకపోయింది.

పకడ్బందీగా, ఆచితూచి వ్యవహరించటం, ప్రపంచదేశాల సహకారాన్ని కూడగట్టటం, ఉగ్రవాదానికి నిధులు అందకుండా చూడటం, నిఘా సమాచారాన్ని పంచుకుంటూ సమన్వయంతో తీవ్రవాద కట్టడి ఈ రకమైన సమగ్ర చర్యలు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవటం, నియంత్రించటం, తగ్గించటంలో మంచి ఫలితాలనిస్తాయి. దశాబ్దాల ఖండాంతర సవాలును ఎదుర్కోవటానికి దీర్ఘకాలిక, సమన్వయంతో కూడిన వ్యూహం తప్పనిసరి. తక్షణ పరిష్కారాలేమీ లేవు.

పాకిస్థాన్ అణ్వాయుధాలున్న పెద్ద దేశం (25.5 కోట్ల జనాభాతో 5వ అతిపెద్ద దేశం). అణ్వస్త్ర పొరుగుదేశంతో పూర్తిస్థాయి యుద్ధం సాధ్యం కాదు. వాంఛనీయమూ కాదు. అటువంటి పరిస్థితిలో, శత్రువుని సమర్థంగా నియంత్రించటమే మన వ్యూహాత్మక లక్ష్యం కావాలి. యుద్ధమనేది చివరి, గత్యంతరంలేని, అతి తక్కువగా కోరుకోవాల్సిన ఎంపిక మాత్రమే కావాలి. ఇక్కడ మంచి యుద్ధం, చెడ్డ శాంతి లేవు.

విస్తీర్ణం, భౌగోళికంగా వ్యూహాత్మక స్థానంలో ఉండటం, అంతర్గత సామాజిక–రాజకీయ అస్థిరత్వం, అణ్వాయుధ సామర్థ్యం రీత్యా పాకిస్థాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం మన ప్రయోజనాల్ని తీవ్రంగా దెబ్బతీయగలదు. ప్రాణ, ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థకు హాని సుస్పష్టం. వీటితోపాటు, భారత్ లాంటి సుస్థిర, బాధ్యతాయుత, మానవీయ, నాగరిక సమాజం ముందు వెనకలు ఆలోచించుకోకుండా వినాశకర అణు యుద్ధంలోకి దిగటం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. పర్యవసానాలు పెనుస్థాయిలో ఉంటాయి.

పాకిస్థాన్‌ని అణ్వస్త్రహితం చేయకుండా కకావికలు చేసినా, అరాచక శక్తులు పెచ్చరిల్లుతాయి. అరాచక పాక్ మొత్తం ప్రపంచానికి, మన దేశానికీ ఉగ్రవాద ముప్పుని ఇంకా పెంచుతుంది. అంతర్యుద్ధం లేదా దేశాల మధ్య యుద్ధంలో ఒక దేశం పతనమైనప్పుడు, తీవ్రవాద మూకలు చెలరేగటం, సర్వత్రా భద్రతకు ముప్పుగా పరిణమించటం ప్రపంచం అనేక సందర్భాల్లో చూసింది.

ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, సిరియా, లెబనాన్, యెమెన్, సోమాలియా జాబితా కొనసాగుతుంది. మన లక్ష్యం తీవ్రవాదాన్ని

నిర్మూలించటం, కనీసం గణనీయంగా తగ్గించటం. మనం పాకిస్థాన్‌తో యుద్ధానికి దిగితే, అది పూర్తిస్థాయి యుద్ధంగా పరిణమించవచ్చు. అప్పుడు చైనా జోక్యం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి అణ్వస్త్ర ప్రళయానికి, మానవాళి ముగింపు పోరుకి దారితీస్తుందేమోనని భయపడి, మిగిలిన ప్రపంచం కూడా యుద్ధం ఆపాలని గట్టిగా ఒత్తిడి తేవచ్చు.

ఇటువంటి పరిణామాల్లో భారతదేశం తన నైతిక పైచేయిని, అంతర్జాతీయ సానుభూతిని, మద్దతును కోల్పోయే ప్రమాదం ఉంది. ఒక బాధ్యతాయుత జాతి-రాజ్యంగా, ఉగ్రవాద బాధిత దేశంగా ఇప్పటిదాకా ప్రపంచం మన పట్ల సానుకూలతతో ఉంది. పూర్తిస్థాయి యుద్ధమంటూ వస్తే, మనం కూడా భారీ నష్టాల్ని చవిచూడాల్సి వస్తుంది. ముఖం బాగా లేదని ముక్కు తెగ్గోసుకోవటం విజ్ఞత గల వ్యూహమా?మన ప్రజలు బాధితులై నష్టపోతున్నందుకు పాకిస్థాన్‌ను నాశనం చేయటం ఏరకంగానూ ఊరట, పరిహారం కాదు. మన బాధని, ఆగ్రహాన్ని నిర్మాణాత్మక, వ్యూహాత్మక వ్యక్తీకరణగా మలచాలి.

మనం ఉగ్రవాదాన్ని పంజాబ్‌లో విజయవంతంగా ఎదుర్కొన్నాం. రెండు దశాబ్దాలకు పైగా సమయం పట్టి ఉండొచ్చు- కానీ మన సహనం, సమన్వయంతో కూడిన దీర్ఘకాలిక వ్యూహం అక్కడ సత్ఫలితాలనిచ్చాయి. జమ్మూ కశ్మీర్‌లోనూ మన వ్యూహం ఫలితాలనిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు అక్కడ మరింత ఐక్యతకు, వలసలు, పెట్టుబడులు, ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తోంది.

పర్యాటకం పెరుగుతోంది. ప్రజలు పెద్దసంఖ్యలో ప్రజాస్వామిక ప్రక్రియలో, ఆర్థిక కలాపాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నిజానికి, పాకిస్థాన్ దన్నుతో ఉగ్రవాద గుంపుల బరితెగింపు చర్యలకు కారణం అదే. తమ ఉనికిని కోల్పోతున్నామన్న నిరాశ, తెంపరితనం నుంచి పాల్పడుతున్నవే ఈ దాడులు. దీపం ఆరిపోయేముందు వెలుగులు విరజిమ్మటం లాంటి పరిస్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. మనం వారి ఉచ్చులో పడకూడదు మన పంథా మార్చుకోకూడదు. సహనం, ఓర్పు, ఆలోచనాత్మక కార్యాచరణ, దీర్ఘకాలిక వ్యూహం ఇవే జమ్మూకశ్మీర్, మొత్తం భారతదేశ మెరుగైన భవిష్యత్తుకి కీలకమైనవి. కశ్మీరీ ప్రాంతం భారత్ లో మరింత అంతర్భాగమవటం, అభివృద్ధి సాధిస్తుండటంతో ఉగ్రవాదుల్లో చేరికలు తగ్గుతున్నాయి. సుస్థిర, అభివృద్ధి సాధక, స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య దేశం భారత్‌లోనే తమ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ప్రజలు ఉన్నకొద్దీ గుర్తిస్తారు.

సామరస్యత, అభివృద్ధి బలంగా ఉండటం మాత్రమే అంతిమంగా భారతదేశ సురక్షితకు,రక్షణకు అత్యుత్తమ భరోసాలు. మెరుగైన మౌలిక వసతులు, మరిన్ని పెట్టుబడులు,

**పాకిస్థాన్ దన్నుతో ఉగ్రవాద గుంపుల బరితెగింపు చర్యలకు కారణం అదే. తమ ఉనికిని కోల్పోతు న్నామన్న నిరాశ, తెంపరితనం నుంచి పాల్పడుతున్నవే ఈ దాడులు. దీపం ఆరిపోయేముందు వెలుగులు విరజిమ్మటం లాంటి పరిస్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. మనం వారి ఉచ్చులో పడకూడదు మన పంథా మార్చు కోకూడదు. సహనం, ఓర్పు, ఆలోచనాత్మక కార్యాచరణ, దీర్ఘకాలిక వ్యూహం ఇవే జమ్మూకశ్మీర్, మొత్తం భారతదేశ మెరుగైన భవిష్యత్తుకి కీలకమైనవి.**

ఇంకా ఎక్కువ ఉత్పాదకత, సమ్మిళిత ఆర్థికావృద్ధి, ప్రతి పౌరుని హక్కుల్నీ కాపాడే చట్టబద్ధ పాలన మన భవిష్యత్తుకి అంతిమ రక్షాకవచాలు.

ఆధునిక జీవితానికి సంబంధించిన ఒక చేదు నిజాన్ని కూడా ఇక్కడ మనం గుర్తించాలి ఉగ్రవాద నిర్మూలన పూర్తి స్థాయిలో బహుశా ఎప్పటికీ సాధ్యం కాదు. ఇంకా ఇంకా సంక్లిష్టమయ్యే పరస్పర అనుసంధాన ప్రపంచంలో మనం బతుకుతున్నాం. మన సరఫరా గొలుసులు అంతర్జాతీయంగా విడదీయలేని విధంగా ఉన్నాయి. నిరంతర ఆర్థిక కలాపాలు, వివిధ దేశాలకు రాకపోకలు, స్వేచ్ఛాన్వేషణ ఈ సున్నిత ప్రపంచంలో మనల్ని దుర్బలుల్ని చేస్తున్నాయి.

తెంపరితనం, పిచ్చితో అనారోగ్యకర ఆలోచనా ధోరణులు గల కొద్దిమంది దుండగులు చాలు -కల్లోలం సృష్టించడానికి. జీవితాన్ని సమాజగతిని ఒడిదుడుకుల్లోకి నెట్టటానికి! ఇటీవల ఒక విద్యుత్ సబ్ స్టేషన్ దెబ్బతింటే (ఉగ్రవాదంతో సంబంధం లేదు) ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే లండన్ విమానాశ్రయం హీత్రోను రోజుల తరబడి మూసేయాల్సి వచ్చింది. కత్తిపట్టిన ఒక తీవ్రవాది లేదా స్టీరింగ్ ముందు కూర్చున్న మతిస్థిమితం లేని ఒక డ్రైవరు అనేకమంది అమాయకుల ప్రాణాల్ని గాలిలో కలిపేయగలరు.

భారీ సాయుధ బలగాలు, నిరంకుశ పాలన గల అన్ని రకాల స్వేచ్ఛల్నీ అణగదొక్కి విపరీత బలప్రయోగం చేసే దేశం మాత్రమే ఉగ్రవాదాన్ని దాదాపు అంతం చేయగలదు. కానీ ఒక స్వేచ్ఛా సమాజంలో ఒక దేశమే తీవ్రవాదాన్ని పెంచి ప్రోత్సహించటం ఆమోదయోగ్యం కాదు. ఉన్నట్టుండి విరుచుకుపడే ఉగ్రవాద చర్యలు సమీప భవిష్యత్ లో మన జీవితంలో భాగంగా మారవచ్చు. అలాంటి పరిస్థితుల మధ్య మనం బతకాల్సి రావచ్చు. కానీ ఆలోచన, లక్ష్య స్పష్టత, సమర్థ సమన్వయంతో కూడిన దీర్ఘకాలిక వ్యూహంతో మనం ప్రమాదావకాశాల్ని నామమాత్రం చేసి స్వేచ్ఛను పెంచుకోవచ్చు. తొందరపాటు స్పందన, అదుపులేని ఆగ్రహం సమస్యల్ని ఇంకా జటిలం చేస్తాయి. ✯

# అమెరికా స్వాతంత్ర్య ప్రకటన @ 250

ప్రపంచానికి తెలిసిన ఆచరణసాధ్య రాజ్యవ్యవస్థలలో ఇప్పటి వరకూ అత్యుత్తమమైనది ప్రజాస్వామ్యం. బ్రిటన్‌ను ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా చెబుతారుగానీ, ఆధునిక ప్రజాస్వామ్యానికి మాతృకగా అమెరికా దేశాన్నే చెబుతారు. 1215లో 'మ్యాగ్నెకార్టా'తో 'రాజు సర్వాధికారి కాదు' అనే ప్రజాస్వామిక భావనకు ఇంగ్లండ్ నాంది పలికినా, ప్రజాస్వామ్యం పట్ల చులకన భావాన్ని, అపనమ్మకాన్ని, అరాచకత్వానికి పర్యాయపదం అనే భ్రమను తొలగించి ఒక అత్యుత్తమ పాలనా విధానంగా ప్రపంచానికి ప్రజాస్వామ్యం బలాన్ని చాటింది అమెరికా! అమెరికా స్వాతంత్ర్య ప్రకటన ఈ ఏడాది జులై 4న 250వ సంవత్సరంలోకి ప్రవేశిస్తుంది. ఈ నేపథ్యంలో అమెరికా స్వాతంత్ర్య పోరాటాన్ని, తాజా పరిస్థితులను పరిశీలించాల్సిన సందర్భమిది..

భారతీయుల్లా గోధుమ వర్ణంలో ఉండే మూలవాసుల్లో అత్యధికుల్ని నిర్మూలించో, ఓడించో, తరిమికొట్టో లేక సువిశాల భూభాగాల్ని ఆక్రమించో, ఐరోపావాసులు, ముఖ్యంగా ఇంగ్లండ్ వాసులు అమెరికా గడ్డమీద స్థిరనివాస మేర్పరచుకున్నారు. 1607లో వర్జీనియా ప్రాంతంలో జేమ్స్ టౌన్‌ను బ్రిటిష్ వారి తొలి శాశ్వత కాలనీగా చెబుతారు. అయితే తెల్లతోలు వారు కాబట్టి భాషతో కూడా పెద్ద సమస్య లేదు కాబట్టి భారత్ లోలా ద్వితీయ శ్రేణి పౌరులుగా వారిని పరిగణించే అవకాశం తక్కువ. మరి ఎందుకు ఇంగ్లండ్ తో హింసాత్మక యుద్ధం చేసి మరీ అమెరికన్లు స్వాతంత్ర్యం తెచ్చుకోవాల్సి వచ్చింది?

బ్రిటిష్ అమెరికాలో స్థిరపడిన వారిలో ఎక్కువమంది వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. వారి ప్రమేయం లేకుండా, వారికి ప్రాతినిధ్యం ఇవ్వకుండా పన్నుల్ని విధించటం వారిలో అసంతృప్తిని రాజేసింది. ఇప్పటి హార్వర్డ్ యూనివర్శిటీ సహా 9 కళాశాల్ని అప్పటికే బ్రిటిష్ అమెరికన్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటిని వలస కాలేజీలు అని పిలిచేవారు. అమెరికా రిపబ్లిక్ ఎలా ఉండాలో, వందేళ్లకు ముందునుంచే ఈ విద్యా సంస్థల్లో చర్చోపచర్చలు జరిగాయి. ఉదాహరణకు అమెరికా స్వాతంత్ర్య పోరాటం నాటికి హార్వర్డ్‌కి సుమారు 140 ఏళ్లు. ఈ విశ్వవిద్యాలయాల పూర్వ విద్యార్థులు అనేకమంది అమెరికన్లు విముక్తి పోరాటంలో పాల్గొన్నారు. తొలుత అంశాలవారీ స్వయంప్రతిపత్తి అనుకున్నా.. 1770 నాటికి తిరుగుబాటు ద్వారా సంపూర్ణ విముక్తే మార్గమని నిర్ణయించుకున్నారు.

ఇంగ్లండ్‌లో బోస్టన్ టీ పార్టీతో తిరుగుబాటు మొదలైంది. సెకండ్ కాంటినెంటల్ కాంగ్రెస్‌లో జార్జి వాషింగ్టన్ నేతృత్వంలో కొద్దిపాటి సైన్యంతో, ప్రజల నుంచి, వర్సిటీల నుంచి కొంత మందిని దళాలుగా ఏర్పాటు చేయటంతో స్వతంత్ర దేశంగా అమెరికాను ప్రకటించుకునే కార్యాచరణను ప్రారంభించారు. తొలి విజయాల అనంతరం 1776 జులై 2న తీర్మానం చేసి, 4వ తేదీన




స్వాతంత్ర్య ప్రకటనను జారీ చేశారు. 13 రాష్ట్రాలతో అమెరికా రిపబ్లిక్ అవతరించింది. 1776లో బ్రిటన్‌తో అమెరికా యుద్ధం ముగియలేదుగానీ, ఆ ఏడాది స్వాతంత్ర్య ప్రకటన అమెరికా ఆవిర్భావ చరిత్రలో ఎంతో కీలకమైనది. ఆ తర్వాత 1783 వరకూ ఇంగ్లండ్‌తో ఓడుతూ గెలుస్తూ యుద్ధాలు చేసి చివరికి ఉత్కంఠ పరిణామాల మధ్య ఇంగ్లండ్‌తో శాశ్వత స్వాతంత్ర్య ఒప్పందాన్ని ప్యారిస్ సంధి ద్వారా, అమెరికన్లు కుదుర్చుకున్నారు. బ్రిటన్‌కు భిన్నమైన సొంత ఇంగ్లీష్ యాస, పదాల స్పెల్లింగ్, సంస్కృతి, అలంకరణ రీతుల్ని అభివృద్ధి చేసుకున్నారు. అమెరికన్లు అప్పట్నుంచి జులై 4ను స్వాతంత్ర్య దినోత్సవంగా మరింత ఘనంగా జరుపుకోవటం ప్రారంభించారు. విముక్తికి చిహ్నంగా ఇంగ్లండ్ చక్రవర్తి దిష్టిబొమ్మల్ని దగ్ధం చేయటంతో పాటు.. బాణాసంచాలు, ఆహార విహారాలకి ఆరోజున బిలియన్ల డాలర్లు ఖర్చు చేయటం మొదలుపెట్టారు. ఆ చారిత్రక ఘటనకే ఈ ఏడాది 250వ ఆవిర్భావ దినోత్సవం, వచ్చే ఏడాది జులైలో వార్షికోత్సవం.

**13 రాష్ట్రాల రిపబ్లిక్ ప్రకటనలో కనిపించని ప్రజాస్వామ్యం పదం**

ఒక గొప్ప ఆధునిక ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలన్న లక్ష్యం ఎక్కడా అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలో కనిపించలేదు. ప్రజాస్వామ్యం అమెరికన్ స్వాతంత్ర్య యోధుల లక్ష్యం కాదు. 1347 పదాలు, అందులో పీఠికలో 42 పదాలు కలిగిన అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు స్వేచ్ఛ, సమానత్వం, స్వయంపాలన స్ఫూర్తినిచ్చాయి. స్వాతంత్ర్య ప్రకటన రూపకల్పనలో కీలకపాత్ర పోషించాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యం అన్న పదం లేకుండా 13 రాష్ట్రాల రిపబ్లిక్‌గా మాత్రమే అమెరికా అవతరించింది.

స్వాతంత్ర్య ప్రకటనని ప్రధానంగా థామస్ జఫర్సన్ రాశారు. జాన్ ఆడమ్స్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, విలియం లివింగ్ స్టన్, రోజర్ షెర్మన్ కమిటీ సభ్యులుగా తోడ్పాటునందించారు. రెండు రోజుల్లో పూర్తయిన డిక్లరేషన్ మీద విద్యాసంస్థల్లో దశాబ్దాల చర్చల ద్వారా వికసించిన మానవ స్వాభావిక లక్ష్యాలు, జాన్

లాకె భావాల ప్రభావం గణనీయంగా కనిపిస్తుంది. జులై 4న అధికారికంగా, ఏకగ్రీవంగా కాంటినెంటల్ కాంగ్రెస్ దేశ స్వాతంత్ర్య ప్రకటనను ఆమోదించింది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు పలువురు సంతకాలు చేశారు. అమెరికాలోని వారంతా భద్రతతో, సంతోషంగా బతకాలనే లక్ష్యంతో "మనుషులంతా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జన్మించారు" అనే వాక్యాన్ని స్వతంత్ర ప్రకటనలో చేర్చారు. అంటే, అంతర్లీనంగా 'ప్రజాస్వామ్య స్ఫూర్తే' అమెరికా విప్లవాన్ని నడిపించింది.

స్వాతంత్ర్య ప్రకటన చేసినప్పుడు, ప్రపంచంలోనే అత్యున్నత స్థానంలో నిలిచి, దాదాపు మిగిలిన దేశాలన్నిటికీ చాలా విషయాల్లో దారిదీపంగా ఉంటూ, అంతర్జాతీయంగా గణనీయ ప్రభావం చూపే స్థాయిలో 250వ సంవత్సర ఉత్సవాన్ని అమెరికా జరుపుకుంటుందని, జార్జి వాషింగ్టన్, జఫర్సన్, ఆడమ్స్, ఫ్రాంక్లిన్, మేడిసన్ తదితర పెద్దలు ఊహించారో లేదో కానీ.. ఈ స్థాయికి రావటానికి అమెరికా ఎన్నో పెనుసవాళ్ళను, ఒడిదుడుకులను ఎదుర్కొంది.


**సవాళ్లు, ఒడిదుడుకులు**

అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలో ఎన్నో ఆదర్శవంతమైన పదాలు, మనుషులంతా సమానమే అనే భావం స్పష్టంగా కనిపిస్తాయిగానీ బానిసత్వం, నలుపు-తెలుపు పక్షపాతం, మూలవాసులైన వారి గోధుమ వర్ణాన్ని కూడా కించపరిచే ధోరణి, మహిళల పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతుండేవి. ఆఫ్రికా తదితర దేశాల నుంచి తీసుకొచ్చిన నల్లజాతి (నీగ్రో) బానిసలు 5,00,000 మంది దాకా ఉండేవారని అంచనా. ఈ తీవ్ర వైరుధ్యం అమెరికా నిర్మాతల్ని కలచివేసిందిగానీ, స్వతంత్రం కోసం పోరాడినంత విప్లవాత్మకంగా సమానత్వం కోసం పోరాడలేక పోయారు. అందరికీ సమాన హక్కులిచ్చే ప్రజాస్వామ్యం అనే పదం, భావన అప్పటికే వారికి పరిచయం ఉందిగానీ ఆ పాలనా పద్ధతి ఆచరణ సాధ్యం కాదని, అరాచకానికి దారి తీస్తుందని భయపడేవారు.

**ప్రజాభిప్రాయానికి పెద్దపీట**

కానీ ఎవరు అధికారంలో ఉండాలి, ఎలాంటి పాలన అందించాలి అనే విషయాల్ని నిర్ణయించటంలో సామాన్య ప్రజలకు గణనీయ భాగస్వామ్యాన్ని అందించటం.. చెప్పాలంటే, ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేయటం మొదటిసారిగా అమెరికా స్వాతంత్ర్య ప్రకటనతోనే మొదలైంది. మొత్తంగా ప్రజలు "పావులు కాదు పౌరులు, అధికార పీఠాన్ని మార్చగలిగేవారు" అనే అభిప్రాయం ప్రకృతి సహజ సమానత్వ భావానికనుగుణంగా ఎక్కువ దిశానిర్దేశం చేయటంతో ఆధునిక ప్రజాస్వామ్యం దిశగా సంస్కరణలు పరిణామక్రమంలా చోటుచేసుకోనారంభించాయి. అయితే స్వాతంత్ర్య ప్రకటనను సంపన్నులే తయారు చేయడంతో యథాతథస్థితే కొనసాగే అవకాశం ఉందని అనేక విమర్శలొచ్చినా.. తొలితరం అధ్యక్షులు ఆదర్శాలకు కట్టుబడటం వల్ల ఆ విమర్శలు పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, స్వాతంత్ర్య ప్రకటన వెలువడిన ఏడున్నర దశాబ్దాల తర్వాత తొలిసారిగా అమెరికా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది.

**పునర్జన్మనిచ్చిన లింకన్**



రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన అబ్రహాం లింకన్ అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకి పునర్జన్మనిచ్చారు. 1860లో అధ్యక్ష అభ్యర్థిగా పోటీచేసే క్రమంలో లింకన్ చేసిన ప్రసంగాలు, ప్రజాస్వామ్యాన్ని విస్పష్టంగా ప్రస్తావిస్తూ ఇచ్చిన భాష్యాలు, స్పష్టతలు, నిర్దేశించిన లక్ష్యాలు అమెరికా చరిత్రను గొప్ప మలుపుతిప్పాయి. విఫల ప్రయోగంగా ఊబిలో కూరుకుపోతుందనుకున్న అమెరికా ఒక్క ఉదుటున పైకెగసి కొన్ని శతాబ్దాలకు సరిపడా ఉజ్వల భవిష్యత్తుకి సామర్థ్యాన్ని సమకూర్చుకోవటానికి దోహదం చేశాయి. అమెరికా చరిత్రలో ఇప్పటికీ అత్యుత్తమ అధ్యక్షుల జాబితాలో అబ్రహాం లింకన్ పేరు మొదటి స్థానంలో కొనసాగుతుండటానికి కారణమయ్యాయి. ప్రజాస్వామ్యానికి గొప్ప నిర్వచనం అంటే ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనైనా అబ్రహాం లింకన్ కొటేషన్ నే చెబుతారు. "ప్రజల యొక్క, ప్రజల కొరకు, ప్రజల ద్వారా", ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే అంతిమమని స్పష్టంగా ప్రకటించిన నాయకుడాయన. ప్రజాభిప్రాయంతో ఏదైనా సాధ్యమే, అది లోపిస్తే ఏదీ సాధ్యం కాదు అని పేర్కొన్నారు. అయితే బానిసల విముక్తి విషయంలో ప్రజాభిప్రాయాన్ని మన్నించాలన్న సహచరుల, ప్రత్యర్థుల అభిప్రాయాన్ని లింకన్ పూర్తిగా తిరస్కరించారు. ప్రజాస్వామిక విలువలకు సంబంధించి స్వాతంత్ర్య ప్రకటనే దిశానిర్దేశం అని తేల్చి చెప్పారు. మానవ హక్కులు, గౌరవానికి సంబంధించిన కొన్ని మౌలికాంశాలలో సాంప్రదాయం, ప్రజాభిప్రాయం కన్నా చట్టం మిన్న అని చెప్పటం ద్వారా.. స్వేచ్ఛను కోరుకుంటున్న ప్రజలు చట్టబద్ధ పాలనను, రాజ్యాంగ ప్రక్రియను అనుసరించాలని, అప్పుడే నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య అంతర్లీన సూత్రాన్ని ప్రజలకు అర్థమయ్యేలా లింకన్ తెలియచెప్పారు. అదేవిధంగా ప్రజలు ఓటు ద్వారా ఇచ్చిన అధికారం బ్లాంక్ చెక్ కాదని, ప్రజాభిప్రాయానికి బద్ధులై ఉండాలని నాయకులకు పరిమితుల్ని స్పష్టపరిచారు.

అబ్రహాం లింకన్ తర్వాత వందేళ్లకి ఆయన ప్రయత్నం ఒక కొలిక్కి వచ్చింది. ఈ ప్రజాస్వామిక హక్కుల పోరాటంలో నల్ల జాతీయుల కన్నా లింకన్ సహా తెల్ల జాతీయులే ఎక్కువ రక్తం చిందించారు. కలల్ని కలబోసుకుని ఆదర్శాల్ని రూపొందించుకోవటంలో అమెరికాకు తుపాకీకన్నా పుస్తకం ఎక్కువ సహాయపడింది. సాఫ్ట్ పవర్‌ని ప్రోత్సహించటం, పెంచుకోవటం, సోవియెట్ యూనియన్, ఆ కూటమి దేశాలు అమలు చేస్తున్న విధానాలకు భిన్నంగా..స్వేచ్ఛా ఆలోచనా ధోరణి, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, ప్రజలకు ఎన్నిక, ఎంపిక స్వేచ్ఛ, అత్యుత్తమ సామర్థ్యాల్ని, ఆక్రమంలో వలసల్ని ప్రోత్సహించటం వంటి కారణాల వల్ల అనేక దేశాల నిపుణులు, మేధావులు, విద్యార్థులకు

అమెరికా కలల సామ్రాజ్యంగా రూపొందింది. సోవియెట్ యూనియన్ తదితర కమ్యూనిస్టు దేశాలతో పోటీ, రెండు ప్రపంచ యుద్ధాలు అమెరికా ప్రభావాన్ని, మార్కెట్‌ను ప్రపంచ స్థాయికి విస్తరించాయి.

**సంక్షోభాల్లో గొప్ప నాయకత్వం**

ఒక ఉదార ప్రజాస్వామ్య దేశంగా, భారత్ సహా ఎన్నో దేశాలను అమెరికా ప్రభావితం చేసింది. విషయం వేరైనా ముందు శతాబ్దంలో లింకన్ కాలంలో వచ్చిన తరహాలో తలెత్తిన కొన్ని అసాధారణ సంక్షోభాల్ని.. అప్పటికీ ఏర్పడిన పటిష్ట పునాదులు ఆధారంగా ఆయా కాలాల్లోని అధ్యక్షులు సమర్థంగా పరిష్కరించారు. ముఖ్యంగా 1929లో వచ్చిన గ్రేట్ డిప్రెషన్, ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ గొప్ప నాయకత్వాన్ని అందించి అమెరికాను అగ్రరాజ్య హోదా లో నిలిపారు. సాంకేతికంగా, ఆర్థికంగా, పరిజ్ఞాన పరంగా, సైనికంగా తిరుగు లేని శక్తిగా ఎదిగి తన కరెన్సీ డాలర్‌ని ప్రపంచంలో ఎక్కడైనా ఆమోదించే రిజర్వు కరెన్సీగా మార్చుకుంది.

**ఏకధ్రువ ప్రపంచంలో తడబాటు**

సోవియెట్ యూనియన్‌ను ఎదుర్కొనే క్రమంలో తానే పెంచి పోషించిన ఇస్లాం సాయుధ తీవ్రవాదాన్ని నిర్మూలించటానికి పాత తప్పులే చేస్తూ ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లపై దండ యాత్రలు సాగించింది. వియత్నాంపై యుద్ధంలోలా, ఈ రెండు దేశాలపై యుద్ధం వల్ల ఏమీ సాధించకపోగా ఆర్థిక, సైనిక సంపత్తిని తీవ్రంగా నష్టపోయింది. ఇరాక్‌పై దండయాత్రకు కారణంగా చూపిన రసాయన ఆయుధాలేవీ అక్కడ దొరక్కపోవటంతో అంతర్జాతీయంగానే కాదు, స్వదేశంలోనూ ప్రతిష్టను మసక బార్చుకుంది. ఈలోగా తానే ప్రారంభించిన ప్రపంచీకరణ ప్రక్రియ బహుళ ధృవ ప్రపంచానికి దారి తీస్తుండటం అమెరికాను మరింత గందరగోళపరిచింది.

**ఆసియా దేశాల పోటీ**

అమెరికా స్వాతంత్ర్య ప్రకటన నాటికి బ్రిటిష్ వలస పాలనలో మగ్గుతూ, ఆత్మన్యూనతతో బిక్కుబిక్కుమంటున్న చైనా, భారత్ లు ఆర్థిక రంగంలో తమ పంథా మార్చుకుని సాంకేతికత, ప్రపంచీకరణ అవకాశాల్ని అందుకునేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా చైనా ముందు మేలుకొని ఆర్థిక సంస్కరణల బాటపట్టి, విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాల మీద దృష్టిపెట్టి ఉత్పత్తిరంగాన్ని భారీ ఎత్తున చేపట్టటంతో ప్రపంచీకరణ అవకాశాల్ని బాగా అందుకుంది. చైనా చౌక ఉత్పత్తులు అమెరికా సహా ప్రపంచ దేశాలన్నిటినీ ముంచెత్తటంతో, సుమారు ఇరవయ్యేళ్లపాటు పదిశాతం దాకా వృద్ధి రేటును చైనీయులు తదేకంగా సాధించారు. ఫలితంగా, ప్రపంచ చరిత్రలోనే మొదటిసారిగా కోట్లాదిమంది ప్రజల్ని పేదరికం నుంచి మూకుమ్మడిగా బయటపడేయగలిగింది. ఒకప్పుడు అమెరికా యుద్ధంలో భారీగా దెబ్బతిన్న వియత్నాం పెట్టుబడులను ఆకర్షిస్తూ వేగంగా పెరిగింది. అదేరీతిలో దక్షిణ కొరియా. భారత్ స్వతంత్రం వచ్చాక ఆర్థిక, విద్య, వైద్యం వంటి కీలకరంగాలలో అనేక అవకాశాలను జారవిడిచినా, 1990ల తర్వాత విధిలేని పరిస్థితుల్లోనైనా మేలుకోవటం, ప్రపంచంలో పనిచేసే వయసు జనాభా అత్యధికంగా ఉండటంతో వేగంగా అభివృద్ధిని సాధిస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే, 20వ శతాబ్దంలో ఉన్న ఆత్మవిశ్వాసం, అభివృద్ధిపట్ల భరోసా అమెరికా ప్రజల్లో సన్నగిల్లుతుండగా.. భారత్, చైనా, ఇతర ఆసియా దేశాల్లో పెరుగుతోంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తొలిసారి ఎన్నికైనప్పుడు, అంతకు ముందు అధ్యక్షుడు బరాక్ ఒబామా పర్యావరణ పరిరక్షణ కోసం కుదుర్చుకున్న ప్యారిస్ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే.. ఆ అవకాశాన్ని కూడా చైనా అద్భుతంగా ఉపయోగించుకుని ప్రత్యామ్నాయ ఇంధన వనరుల రంగంలో భారీ ఆదాయాల్ని ఆర్జిస్తోంది. అదే ఒరవడిలో తక్కువ ఖర్చుతో క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో వేగంగా పురోగతిని సాధిస్తోంది. స్థూల జాతీయాదాయాన్నే తీసుకుంటే మనం అంతర్జాతీయంగా నాలుగో స్థానంలో ఉన్నా, మొదటి స్థానంలో ఉన్న అమెరికాతో ఉన్న అంతరం చాలా ఎక్కువ. అమెరికా జీడీపీ తాజాగా ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, 30.51 లక్షల కోట్ల డాలర్లు కాగా, భారత్ జీడీపీ 4.19 లక్షల కోట్ల డాలర్లు, చైనా జాతీయాదాయం 19.23 లక్షల కోట్ల డాలర్లు.

**చైనా భయంతో అమెరికా మనకు మద్దతు ఇస్తోంది**

మనకున్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని చైనాలాగా పాతికేళ్లపాటు ఏకబిగిన 8శాతం చొప్పున వృద్ధి రేటును సాధిస్తే, 2047 నాటికి ఇప్పుటి చైనా స్థాయికి చేరగలం కానీ, అమెరికా జీడీపీని అందుకోలేం. అయితే మనం ఎనిమిది శాతానికి పైగా నిరంతరాయ వృద్ధిరేటు సాధించగలిగితే.. మారకం విలువ రీత్యా కాకున్నా, వినియోగ సూచీరీత్యా అమెరికా స్థాయిని అందుకోగలం. ఈ నేపథ్యంలో, బహుళ ధ్రువ ప్రపంచం, ద్వైపాక్షిక, ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాల యుగంలో అమెరికా తన ఉజ్వలతను భవిష్యత్తులోనూ కాపాడుకునేందుకు తగిన సంస్కరణల్ని తెచ్చుకోవటం కీలకం.

ఈ పునర్నిర్వచన, భరోసాల అవసరమే డొనాల్డ్ ట్రంప్ లాంటి వ్యక్తికి అవకాశాన్నిచ్చాయి, పెరిగిపోతున్న అప్పుల్ని, ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించటం, ప్రజల పన్నుల డబ్బును సద్వినియోగం చేయటం, ఆర్థిక వృద్ధిని పరిరక్షిస్తూ ఉపాధి అవ కాశాల్ని పెంచటం, అమెరికన్ సమాజంలో ఆశావాదం పెంచటం వంటి అంశాల్లో సమస్యల్ని ట్రంప్ సరిగ్గానే గుర్తించినా.. ఆయన నిర్ణయాలు, చర్యల పట్ల సంపద సృష్టి గురించి అవగాహన ఉన్నవారిలో అత్యధికులు సంతృప్తికరంగా లేరు. దానికితోడు ట్రంప్ వ్యక్తిగత వ్యవహారశైలి ప్రపంచ మార్కెట్లు, దేశాలతో పాటు అమెరికన్లనూ కలవరపరుస్తోంది.

**లింకన్ బైబిల్ తో ప్రమాణం చేసినా..**

అమెరికా స్వాతంత్ర్య ప్రకటన రాజ్యాంగంపై బైబిల్ విలువ ప్రభావం కనిపిస్తుంది. ట్రంప్ తన ప్రమాణ స్వీకరోత్సవంలో సొంత బైబిల్ తోపాటు, అబ్రహం లింకన్ ప్రమాణం చేసిన బైబిల్‌ను కూడా చేతపట్టుకున్నా.. లింకన్ తరహాలో అమెరికా

కలను పునరుజ్జీవింపచేసే శక్తిని ప్రదర్శించలేకపోతున్నారు. ఏ నల్ల జాతీయుల విముక్తి కోసం లింకన్ ప్రాణాలర్పించారో ఆ జాతీయుల చరిత్రను మసకబార్చే ప్రయత్నం చేస్తున్నారు. అక్రమ వలసలు, జాతి రాజ్యాల వ్యవస్థ, రాజకీయ విభజనలు, సోషల్ మీడియా నకిలీ, విద్వేషపూరిత ప్రచారాల యుగంలో చట్టాలు, నిబంధనలు అవసరమేగానీ, కానీ అవి అమెరికా స్వాతంత్ర్య ప్రకటన కలను చెదరగొట్టేవిగా, రాజ్యాంగానికి వక్రభాష్యాలు చెప్పేవిగా ఉండకూడదు. వలసల దేశంగా, సమాజంగా అద్భుత విజయాల్ని సాధించి ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచిన అమెరికాని ఒక్క జాతిరాజ్యంగా మాత్రమే భావిస్తూ మితిమీరిన ప్రాధాన్యత నిస్తూ వ్యవహరించడం వల్ల తాత్కాలికంగా కొన్ని ఫలితాలు లభిస్తాయేమోగానీ, దీర్ఘకాల ప్రయోజనాల మీద పట్టు కోల్పో వాల్సి వస్తుంది. అమెరికా పౌరసత్వం తీసుకునే అవకాశం వస్తే భారత్ సహా చాలా దేశాలు చాలా మేర ఖాళీ అయిపోతాయి. జాతి రాజ్యాల పరిమితిని మానవాళి, సృష్టి అపరిమితిని, ఏక త్వాన్ని చెప్పటానికి ఇంతకంటే చెప్పక్కర్లేదేమో. లింకన్‌లా దూర నక్షత్ర కాంతిని చూడకుండా, వచ్చి పోయే లాంతర్లు, మిణు గురుల్నే ప్రస్తుతం ట్రంప్ చూస్తున్నారు. 'మేకింగ్ అమె రికా గ్రేట్ ఎగైన్' (మేగా) అని గొప్ప నినాదాన్ని ట్రంప్ ఇచ్చారు కానీ, అమె రికాని గొప్పదేశంగా పున రుజ్జీవింప చేయటమంటే ఏమిటి? అనే స్పష్టతను, అందుకు తగ్గ విజన్‌ని కనబరచలేక పోతున్నారు.

**'మేగా'కి నిర్వచనంలో కొరవడిన స్పష్టత**

అమెరికన్ సమాజంలో తుపాకీ సంస్కృతిని అరికట్టటం, స్వేచ్ఛకు సహేతుక నియంత్రణలను అమలు చేసే చట్టబద్ధపాలన, ఖర్చుకు తగ్గ ఫలితమిచ్చేలా ఆరోగ్య వ్యవస్థను ప్రక్షాళించటం మొదలైన సంస్కరణలను దూరనక్షత్ర కాంతి దార్శనికతతో చేపడితే, అమెరికా సాఫ్ట్ పవర్‌ని పూర్తిస్థాయిలో సద్వినియోగం గావిస్తే అమెరికా పునరుజ్జీవనం సాధ్యమవుతుంది. 21వ శతాబ్దం ఆసియా శతాబ్దమైనా అమెరికా స్థాయి తగ్గదు. ఒక దేశం గొప్పతనం కేవలం ఆర్థిక, సైనిక, సాంకేతిక సంపత్తి మీదే ఎల్లకాలం ఆధారపడదు. ప్రజల రోజువారీ జీవితంలో, వ్యక్తి మానసిక స్థాయిల్లో వాటి సారాంశం ప్రతిఫలిస్తేనే తరాలు మారినా ఉజ్వల భవిష్యత్తుకు ఢోకా ఉండదు.

కాబట్టి అంతర్జాతీయంగా తనపాత్రను పునర్నిర్వచించుకొని నూతన నాగరిక ప్రమాణాలతో హుందాగా వ్యవహరించాలి తప్ప, గోల్డెన్ డోమ్ తో, అంతరిక్ష భద్రత, మరోరకం స్వీయ రక్షణ ధోరణులతో అమెరికా సంకుచితంగా, ఏకాకిగా వ్యవహరించటం తగదు. నీబర్ చెప్పినట్లు, అధికారం, అవకాశం లభిస్తే స్వార్థం, పెత్తనం వైపు మొగ్గు చూపటం మనిషి సహజ నైజం. ఇటువంటి పరిస్థితి అమెరికాలో తలెత్తకుండా వ్యవస్థల్ని బలోపేతం చేస్తారని, ఎక్కడికక్కడ పరిజ్ఞానంతో ప్రజలు పరిపాలనలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ✯

## ప్రజాస్వామ్యానికి ప్రేరణ 'మ్యాగ్నాకార్టా' (1215)

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రజాస్వామ్య విధానంలోనే ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయి. అందరూ సమానం, అందరికీ స్వాతంత్ర్యం అనేవి ఇందులో ప్రధాన నియమాలు. స్వేచ్ఛ, మానవ హక్కులకు ఇందులో ప్రాధాన్యత ఉంటుంది. ఇలాంటి మహోన్నత ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుకు ప్రేరణగా నిలిచిన 'మ్యాగ్నా కార్టా' ప్రకటన 1215లో వెలువడింది. ఇందుకు గుర్తుగా ఏటా జూన్ 15న 'మాగ్నా కార్టా డే' గా నిర్వహిస్తారు.

❯ నాటి ఇంగ్లండ్ రాజు విస్తృత అధికారాలను పరిమితం చేసేందుకు తెచ్చిందే. 'మాగ్నా కార్టా'. ఇది పౌరుల ప్రాథమిక హక్కులపై మొదటి లిఖిత పత్రం. లాటిన్ భాషలో మ్యాగ్నా అంటే పెద్దది, కార్టా అంటే ఒప్పందం అని అర్థం. ఈ ప్రకటనను ప్రజాస్వామ్య హక్కులకు మూలంగా పేర్కొంటారు.

రాజు విధులతో పాటు పౌరులు చట్టపరం గా ఎలా నడుచుకోవాలో మ్యాగ్నాకార్టా నిర్దేశించింది. ఇది బ్రిటన్‌కే కాక, ప్రపంచవ్యాప్తంగా పౌర స్వేచ్ఛకు నమూ నాగా ఉపయోగపడింది. దీన్ని ఇంగ్లండ్ రాజ్యాంగ పత్రంగా పరి గణిస్తారు. అనేక దేశాల రాజ్యాంగాలు దీని నుంచి ప్రేరణ పొందాయి.

❯ మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను సూచించే 3వ భాగాన్ని (ఆర్టికల్ 12 నుంచి 35) 'భారతదేశ మ్యాగ్నా కార్టా'గా పేర్కొంటారు.

**చారిత్రక నేపథ్యం**

ఇంగ్లండ్ రాజైన కింగ్ జాన్ ఎడ్వర్డ్ (1167-1216) పాలనలో ప్రజలు అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. ఈయన జనం నుంచి అధిక పన్నులు వసూలు చేయటంతో పాటు వారిని కఠినంగా శిక్షించేవాడు. చర్చ్ లపై ప్రభుత్వ జోక్యం ఎక్కువగా ఉండేది. ఇతడి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఇంగ్లిష్ బ్యారన్లు (సామంతులు), చర్చి నాయకులు రహస్యంగా సమావేశమై రాజు అధికారాన్ని పరిమితం చేయాలని 'మ్యాగ్నా కార్టా' అనే పత్రాన్ని రూపొందించారు. రాజుతో సహా ప్రజలం దరకూ చట్టానికి లోబడి ఉండాలనే సూత్రాన్ని ఇందులో ప్రతిపాదించారు. అలాగే ప్రజలకు వివిధ హక్కులు కల్పించి, వారి రక్షణ కోసం ప్రత్యేక నియమాలు రూపొందించారు. మొదట జాన్ ఎడ్వర్డ్ దీన్ని ఆమోదించలేదు. అయితే ప్రజల్లో ఇతడిపై వ్యతిరేకత ఎక్కువవటంతో తలొగ్గి 1215, జూన్ 15న మ్యాగ్నా కార్టాపై సంతకం చేశాడు.

❯ రాజు అధికారంపై పరిమితులు విధించటంతో పాటు ప్రజాస్వామ్య పాలన వైపు ప్రపంచ దేశాలు మొగ్గు చూపేలా చేయటంలో, చట్టపరమైన హక్కుల స్థాపనలో 'మ్యాగ్నా కార్టా' కీలక పత్రంగా నిలిచింది.

# డీరెగ్యులేషన్ కమిషన్: ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తుందా? బాధ్యతల నుండి తప్పించుకునేలా చేస్తుందా?

అమెరికా అధ్యక్షుడిగా తన 2.0 హయాంలో ఎడాపెడా టారిఫ్‌లను ప్రకటించి ప్రపంచ మార్కెట్లో ప్రకంపనలు సృష్టిస్తున్న డొనాల్డ్ ట్రంప్ చర్యల పర్యవసానాలపై ఇటీవల ఓ సుప్రసిద్ధ ఎన్నారై ఆర్థికవేత్త భారతలోని ఒక జాతీయ ఇంగ్లీష్ న్యూస్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆర్థిక శాస్త్రంలో అపార అధ్యయనం, అనుభవం ఉన్న ఆయన ప్రస్తుతం యూఎస్‌లో ఒక ఫౌండేషన్‌కి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ట్రంప్ రెండో రాకడ ఖరారైన వెంటనే నవంబర్ లోనే ఆ ఆర్థికవేత్త ఒక విషయం చెప్పారు. 'ట్రంప్ ఎవరు చెప్పినా వినరు, ఆయన్ని టారిఫ్‌లపై ఆపగలిగేది అమెరికన్ బాండ్ మార్కెట్ మాత్రమే' అని తెలిపారు. డాలర్ మారకం విలువ పడిపోయే పరిస్థితి ఎదురైతేనే టారిఫ్‌లపై ట్రంప్ పునరాలోచన చేస్తారన్నారు. సరిగ్గా అదే జరిగింది.

బాండ్ మార్కెట్ ఒడిదుడుకుల దెబ్బకి.. టారిఫ్‌లను వాయిదా వేయటంతో పాటు కొన్నింటిలో సర్దుబాటుకు కూడా ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేశారు. సదరు ఆర్థికవేత్త తన కాలమ్‌లో, కొన్ని ప్రసంగాల్లో చెప్పిన మాటలు నిజమవటాన్ని ఛానల్ ప్రజెంటర్ ప్రస్తావించినప్పుడు, మరో ఆసక్తికర వ్యాఖ్యను ఆ నిపుణుడు చేశారు. అమెరికా ప్రజల్లో దిగువ స్థాయిలో ఉన్న అత్యధికుల్లో అసంతృప్తి పెరిగిపోయిందని సంపన్నుల ఆదాయాలు పెరుగుతుంటే, విదేశాల నుంచి వచ్చిన ప్రతిభావంతులకు మెరుగైన అవకాశాలు లభిస్తూ తమకంటే తలసరి ఆదాయం ఎక్కువగా ఉంటే, తాము మాత్రం భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆందోళన చెందాల్సి వస్తోందని భావిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో యథాతథ స్థితిని బద్దలు కొట్టేందుకు ఒక అంతరాయం లేదా సృజనాత్మక విధ్వంసంలాంటి చర్య అవసరమనటంలో సందేహం లేదన్నారు. అయితే.. డెమొక్రాటిక్ పార్టీ తమ సహజ భావజాలానికి దూరమై, ఆయావర్గాల సమస్యల్ని గుర్తించకపోగా, మార్పు అవసరాన్ని పట్టించుకోకపోవడంతో దుందుడుకు వ్యాపార స్వభావమున్న ట్రంప్ దాన్నే అవకాశంగా మలచుకున్నారన్నారు. స్తబ్ధతను చెదరగొట్టే తన మాటలు, చేతలు, పోకడలతో 'విదేశాల్లో సైనిక ఆపరేషన్లకన్నా (ఇరాన్ పై బంకర్ బ్లస్టర్ బాంబ్ ను కూడా అదే రకంగా, వ్యూహాత్మకంగా ఉపయోగించారు) ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మిన్న' అమెరికాను తిరిగి గొప్ప దేశంగా మార్చటం (మేగా) తమ ప్రాధాన్యత వంటి వాగ్దానాలతో డెమొక్రాటిక్ కంచుకోటలతో పాటు అనిశ్చిత రాష్ట్రాల్లో కూడా అలవోకగా ట్రంప్ మెజారిటీ సాధించారు.

అయితే ఒక సృజనాత్మక అంతరాయాన్ని సృష్టించి దేశంలో అన్ని వర్గాలకూ ఆర్థిక భరోసా ఇచ్చేందుకు భారీ టారిఫ్‌లతో యుద్ధం చేసి ప్రపంచదేశాలను అతలాకుతలం చేయటం కంటే.. ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి ఆర్థిక అవకాశాల్ని విస్తరించే సానుకూల చర్యల్ని చేపట్టి ఉంటే ట్రంప్ ఎక్కువ ఫలితాలు సాధించి ఉండేవాడని ఆ విశ్లేషకుడు తెలిపారు. బైడెన్ ప్రభుత్వ నిష్క్రియా ధోరణుల వల్ల దేశంలో సాధారణంగా పదిలక్షల దాకా వచ్చే అక్రమ వలసల సంఖ్య పాతిక లక్షలదాకా పెరిగిందని, ట్రంప్ కఠిన చర్యలతో అది అయిదు లక్షలకు తగ్గిందన్నారు. ఇలాంటి చర్యలూ విదేశాల్లో యుద్ధాలకు మొత్తం మీద దూరంగా ఉండటం వంటి వాటికి తోడు ప్రతిభను ప్రోత్సహించటంలో ప్రభుత్వ పాత్రను సమర్థంగా నిర్వహిస్తూ, ఆంక్షల అవరోధాలను పూర్తిగా తొలగించి ఉంటే అమెరికా యథాతథస్థితిని బద్దలు కొట్టి అభివృద్ధిలోని కొత్త దశలోకి ప్రవేశించగలిగేదన్నారు. టారిఫ్‌ల యుద్ధం వల్ల చివరికి మొదటి రెండు అగ్రరాజ్యాలు అమెరికా, చైనా ఒకరినొకరు దెబ్బ తీసుకుని, మిగతా ప్రపంచం పుంజుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు.

ట్రంప్ టారిఫ్‌లు లేకుంటే జర్మనీ సహా చాలా దేశాలు స్వావలంబన మీద దృష్టి పెట్టేవి కావని, ట్రంప్ వ్యూహం వల్ల 'మేగా' సంగతేమోకానీ, మిగతా ప్రపంచం స్వయం సమృద్ధి కోసం వేగంగా చొరవ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వాన్ని తగ్గించటానికి చేసిన ప్రయత్నాన్ని 'డోజ్' రూపంలో కేవలం ప్రభుత్వోద్యోగులకే పరిమితం చేసి, అది కూడా సంస్కరణలు కంటే తొలగింపులు, ఖర్చు తగ్గింపుల ఉద్యమం మార్చ టంతో ఆశించిన ఫలితాలు రాకపోగా, కొన్ని సందర్భాల్లో కీలక ఉద్యోగుల్ని సైతం తొలగించి చేతలు కాల్చుకోవాల్సి వచ్చిందన్నారు.

**ఇప్పుడు భారత్ విషయానికి వద్దాం.**

అమెరికాతో పోలిస్తే ప్రభుత్వ ఆంక్షలను, పాత్రను తగ్గించటానికి భారత్ చేయాల్సింది ఎంతో ఉంది. కనీసం వ్యాపార కాంట్రాక్టులను సక్రమంగా అమలు చేయటానికి అవసరమైన చట్టబద్ధపాలన కొరవడటం, నిర్మాణ అను

మతులకు నెలలు తరబడి సమయం పట్టడం వంటి కారణాలవల్ల మన దేశంలో ఈజ్ ఆఫ్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కి చాలా సమయం పడుతోంది. కొన్ని రకాల అవకతవకలు, రాజకీయ జోక్యం వల్ల ప్రపంచ బ్యాంకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్' బిజినెస్ ర్యాంకుల్ని నిలుపు చేసింది గానీ, చిట్టచివరగా బ్యాంకు ప్రకటించిన 2020 సంవత్సరంలో భారత్ కి 190 దేశాల మధ్య 63వ ర్యాంకు లభించింది.

సులభతర వాణిజ్యానికి మన దేశంలో అధికార యంత్రాంగం అలసత్వం, అసమర్థత, వలసకాలం నాటి ఆధిపత్య ధోరణి ఒక పెద్ద కారణం అయినా.. ఎన్నికల్లో అక్రమ వ్యయ అవినీతి కోసం రాజకీయ నాయకులు అనవసర, కాలం చెల్లిన ఆంక్షల్ని, నిబంధనల్ని, చట్టాల్ని కొనసాగించటం, కాంట్రాక్టులు వంటి వాటి నుంచి కమీషన్లు గుంజటం, రాజకీయం  బ్యూరోక్రసీ తరచూ లాలూచీ పడటం వంటి కారణాలెన్నో ఉన్నాయి. 2014లో తాను తొలిసారి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు 'కనిష్ట ప్రభుత్వం గరిష్ట పాలన' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చినప్పటికీ, 'జన విశ్వాస్' పేరుతో కొన్ని కాలం చెల్లిన చట్టాల్ని, నిబంధనల్ని తొలగించినప్పటికీ పెద్దగా మార్పేమీ రాలేదు. 'మేకిన్ ఇండియా' ప్రగతే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో జనవిశ్వాస్ 2.0 ద్వారా సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు మోదీ ప్రభుత్వం డీరెగ్యులరైజేషన్ కమిషన్ ఏర్పాటును ప్రకటించింది.

2025 జనవరి నుంచి ఇందుకు కసరత్తు ప్రారంభించగా, 'ఎకనామిక్ టైమ్స్' ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ప్రపంచ వాణిజ్య సమ్మేళనంలో ప్రధాని మోదీ బిజినెస్ టైకూన్ల సమక్షంలో 2.0ను ప్రకటించారు.

'సమాజంలో ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉండాలని నా స్థిర సంకల్పం. దీని కోసం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నాం. వ్యాపారం చేయటానికి భయపడే పరిస్థితి బదులు సులభంగా వ్యాపారం నిర్వహించేలా మా విధానాలున్నాయి. వివిధ రంగాల్లో ప్రభుత్వ జోక్యాన్ని మరింత తగ్గించేందుకు జన విశ్వాస్ 2.0 ద్వారా మరిన్ని చర్యలు చేపడుతున్నాం. వికసిత భారత్ లక్ష్య సాధనకు ప్రయివేటు రంగం పాత్ర కీలకం. అణు ఇంధనం, టెలికాం, లాజిస్టిక్స్‌యారీ, అంతరిక్షం, బ్యాంకింగ్, వాణిజ్యపరమైన గనుల తవ్వకాలు, విద్యుత్ పంపిణీ, రిటైల్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నాం.

నాలుగోతరం పారిశ్రామిక విప్లవంలో మన దేశం చురుకైన పాత్ర పోషిస్తుంది' అని ప్రధాని పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల యూనియన్ ప్రభుత్వం అధికారిక ప్రకటన సైతం జారీ చేసింది.

ప్రస్తుతమున్న ఆర్బీఐ, సెబీ, ట్రాయ్, సీఈఆర్సీలతో పాటు కొత్త డీరెగ్యులేషన్ కమిషన్ పని చేస్తూ.. ప్రయివేటు పెట్టుబడులను పెంచేందుకు అనుమతులు, ఇతర నిబంధనల అవరోధాలను తొలగిస్తుంది. అనవసర చట్టాలు తొలగించేందుకు సిఫార్సు చేస్తుంది. దీనివల్ల వివిధ శాఖల అధికారుల వద్ద పర్మిషన్లు, ఎక్కువ పన్నుభారం, కఠిన కార్మిక చట్టాల నుంచి స్టార్టప్ లు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊరట లభిస్తుంది. ఈ రకమైన వెసులుబాట్ల వల్లే చైనా, జపాన్ వంటి దేశాలు వేగంగా పారిశ్రామిక పురోగతి సాధించగలిగాయి. డీరెగ్యులరైజేషన్ కమిషన్ వల్ల భారత్‌లో రిటైల్, ఇన్సూరెన్స్, ఈ-కామర్స్ లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరుగుతాయని అంచనా. దేశవ్యాప్తంగా రాష్ట్రాల నిబంధనల మధ్య ఉన్న అంతరాలను తొలగించి ఒకే తరహా పద్ధతుల్ని అనుసరించేలా, తద్వారా వ్యాపార నిర్వహణ సులభంగా జరిగేలా కమిషన్ చర్యలు తీసుకుంటుంది.

**విమర్శకుల హెచ్చరిక**

అయితే దీనివల్ల ప్రజలు ఎన్నుకోని ఓ వ్యవస్థ రాష్ట్రాల మీద పెత్తనం చేసి ఫెడరలిజాన్ని బలహీనపరుస్తుందని, మార్కెట్లు విఫలమైనప్పుడు 2008లో వచ్చిన తరహాలో ఆర్థిక సంక్షోభం వస్తుందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు.

కొందరు వ్యక్తులు కమిషన్‌ని తేలిగ్గా ప్రభావితం చేయగలరని, దీనివల్ల పర్యావరణపరమైన నష్టంతో పాటు పనిచేసేవారిలో 80శాతం మంది దాకా అసంఘటిత రంగంలో ఉన్న మన దేశంలో.. కార్మికులు, కొనుగోలుదారులకన్నా, పెట్టుబడిదారులు ఎక్కువ లాభపడే అవకాశముందంటున్నారు. సంస్థలు ఉపాధి సృష్టికన్నా సంపద సృష్టికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, అందుకోసం సాంకేతికతలు, ఉన్నతోద్యోగుల సామర్థ్యం మీద ఎక్కువ ఆధారపడతాయన్నారు. ఉపాధి లేని వృద్ధిని మన దేశంలో చాలా ఏళ్లుగా చూస్తున్నామని, తాత్కాలికంగా, కాగితం మీద బాగు న్నట్లు కనిపించినా ఏడాదికి కోటిమంది దాకా కొత్తగా ఉద్యోగాల కోసం మార్కెట్‌లోకి వస్తున్న యువ భారత్‌లో ఇది పలురకాల సమస్యల్ని సృష్టిస్తుందంటున్నారు.

**జవాబుదారీతనంతో అవసరం**

మన దేశంలో రెగ్యులేషన్ సంస్కరణలు అవసరమని, అయితే పార్లమెంటుకు కూడా జవాబుదారీ కాని డీరెగ్యులేషన్ పద్ధతిలో, పౌరులకు జీవన భద్రత కల్పించే తన మౌలిక బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించుకునే రీతిలో కాదని ప్రజాస్వామ్యయుతంగా చర్చించి, జవాబుదారీతనంతో సంస్థాగత ఏర్పాట్లు చేయాలని విమర్శకులు సూచిస్తున్నారు. ✮

# మరో మహమ్మారిని ఎదుర్కొనేలా...




**ప్రపంచం కొవిడ్ వంటి మరో మహమ్మారి ముంగిట ఉందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ ఓ) డైరెక్టర్ జనరల్ హెచ్చరించారు. ఆ సంక్షోభం రేపు వస్తుందా, మరో ఇరవయ్యేళ్ల తర్వాత వస్తుందా అన్న విషయం చెప్పలేంగానీ, రావటం ఖాయమన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలన్ని కలిసికట్టుగా ఆ సంక్షోభాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. డబ్ల్యూహెచ్ ఓ 'ద ప్యాండమిక్ ట్రీటీ' సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ, ఇదో మొక్కుబడి ఒప్పందం కాకుండా దేశాలు చిత్తశుద్ధితో అమలుకు కృషి చేస్తేనే మానవాళిని,అభివృద్ధిని కాపాడుకోగలమన్నారు. ఈ సందర్భంగా 'పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ' డిస్టింగ్విష్ట్ ప్రొఫెసర్ కె.శ్రీనాథ్ రెడ్డి 'ది హిందుస్థాన్ టైమ్స్' లో రాసిన వ్యాసమిది. తెలుగు సేతను సాక్షి ప్రచురించింది. ఆ వ్యాసం 'జనబలం' పాఠకుల కోసం:**

కొవిడ్ వంటి మహమ్మారిని మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో ఏప్రిల్ 16న ఈ మేరకు 'ద ప్యాండమిక్ ట్రీటీ' పేరుతో ఒప్పందం కుదిరింది. డబ్ల్యూహెచ్ఓ నేతృత్వంలో కుదిరిన రెండో అంతర్జాతీయ ప్రజారోగ్య ఒప్పందం ఇది. 2003లో 'ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ టూబాకో కంట్రోల్' చర్చల్లో నేను భారత్ కు ప్రాతినిధ్యం వహించాను. పొగాకు నియంత్రణకు సంబంధించిన ఈ ఒప్పందాన్ని అమెరికా, జపాన్, అర్జెంటీనా వ్యతిరేకించినా, యూరోపియన్ యూనియన్ తటపటాయించినా చివరకు వాణిజ్య ప్రయోజనాల కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని గుర్తించారు.

'ద ప్యాండమిక్ ట్రీటీ' విషయంలో వాణిజ్య ప్రయోజనాలు కొందరి ప్రాధాన్యంగా ఉండింది. ఫలితంగా ఈ ఒప్పందంపై నాలుగేళ్లుగా చర్చలు, వాదప్రతివాదాలూ నడిచాయి. కొవిడ్ వంటి మహమ్మారి విషయంలో ఎదురైన వైఫల్యాలను మాత్రం ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి. విపత్కర పరిస్థితుల్లో దేశాల మధ్య మరింత సమన్వయం, సహకారం అవసరమనీ, వట్టి మాటలు, సంఘీభావాలతో ప్రయోజనం తక్కువేననే అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా ఒక ఒప్పందం అవసరాన్ని కూడా గుర్తించాయి. వాస్తవానికి ఈ ఒప్పందం గత ఏడాదే అమల్లోకి రావాల్సింది. ఒప్పంద ప్రతిలోని భాష విషయంలో కొన్ని దేశాలు విభేదించటంతో ఈ ఏడాదికి పొడిగించాల్సి వచ్చింది.

**ధనిక దేశాల మొండిపట్టు**

'ద ప్యాండమిక్ ట్రీటీ' ఏడాది క్రితమే కుదరకపోవటానికి రెండు ప్రధానమైన అంశాలు కారణం. ప్రపంచం మొత్తానికి టీకాలు, మందులు, టెక్నాలజీలు అందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా హామీ పొందటం ఒకటైతే – ప్రమాదకరమైన సూక్ష్మజీవులను మొట్టమొదట గుర్తించిన దేశం దాన్ని ఇతర దేశాలతో పంచుకోవటం (టీకా, మందులపై ప్రయోగాలు, నిర్ధారణ పరీక్షల అభివృద్ధివంటి వాటి కోసం) రెండో విషయం. ధనిక దేశాలు తమ ఫార్మా కంపెనీల ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఈ విషయాలపై పేటెంట్ హక్కులను రక్షించుకునే ప్రయత్నం చేశాయి.

అదే సమయంలో తమకు టీకాలు, మందులు, టెక్నాలజీలు అందుబాటు ధరల్లో ఉండేలా చూడాలని పేద, మధ్యస్థాయి దేశాలు పట్టుబట్టాయి. హానికారక సూక్ష్మజీవులను ఇతర దేశాలతో పంచుకుంటున్నందుకు, క్లినికల్ ట్రయల్స్ ద్వారా తమ జనాభాల్లో టీకా, మందులను ప్రయోగించి చూస్తున్నందుకు తమకు ఈ వెసులుబాటు కల్పించాలని కోరాయి. ఈ వైరుధ్యం కారణంగా చర్చలు దీర్ఘకాలం కొనసాగాయి.

ఒప్పందంలోని పదాలను కూడా అందరికీ ఆమోద యోగ్యమైన రీతిలో మార్చాల్సి వచ్చింది. చివరకు ఈ 2 వివాదాస్పద అంశాలను కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సమావేశాల్లో చర్చలు కొనసాగించాలని నిర్ణయించారు. మే 19న వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ప్లీనరీ సమావేశంలో ఈ ట్రీటీ అమలును ఆమోదించారు. ఫార్మా కంపెనీల ప్రయో జనాలను కాపాడేందుకు ధనిక దేశాలు ఎంత మూర్ఖంగా బేరా లాడాయి అంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకునే విష యంలో 'పరస్పర అంగీకారం ఆధారంగా' అన్న వాక్యాన్ని 'స్వచ్ఛంద పరస్పర అంగీకారం' అని మార్చేంతవరకూ ఒప్పుకోలేదు.

**సానుకూలతలు**

కొవిడ్ సమయంలో ధనిక దేశాలు టీకాలను నిల్వ చేసుకున్న దాఖలాలు ఇంకా తాజాగానే ఉన్నాయి. టీకాలు అందుబాటులో లేనిచోట్ల కొవిడ్ వైరస్ వేగంగా రూపాంతరం చెందిన విషయం తెలిసిందే. ఒక్క విషయమైతే స్పష్టం. ద ప్యాండమిక్ ట్రీటీ విషయంలో ఎన్ని భేదా భిప్రాయాలు ఉన్నా 193 దేశాలు కొన్ని కీలకాంశాల విషయంలోనైతే ఏకాభిప్రాయానికి వచ్చాయి. కొవిడ్ వంటి మహమ్మారులు ప్రబలుతున్న సమయంలో సమాచారాన్ని వేగంగా, తగిన సమయంలో పంచుకోవాలన్నది వీటిల్లో ఒకటి.

అలాగే టీకాలు, మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల తయారీదారులు తామ ఉత్పత్తిలో కనీసం 20శాతాన్ని అందుబాటు ధరల్లో డబ్ల్యూహెచ్ఓకు అందించాలన్నది రెండోది. వ్యాధిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవటం మూడోది. మాస్కులు, పీపీటీ కిట్ల వంటి వాటి సరఫరా, లభ్యతల విషయంలో డబ్ల్యూహెచ్ఓకు పర్యవేక్షణ అధికారం దక్కటం ఒక విశేషం. ఈ ఒప్పందం కొవిడ్ లాంటి మహమ్మారుల నివారణపై కూడా దృష్టి పెడుతుంది. వన్ హెల్త్ పద్ధతిని అనుసరించాలని సూచిస్తోంది. భౌగోళికంగా వేర్వేరు ప్రాంతాల్లో పరిశోధనలు చేపట్టాలనీ, ప్రమాదకర సూక్ష్మజీవులు పరిశోధనకు అందుబాటులో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలనీ, మందులు, ఇతర ఆరోగ్య సంబంధిత ఉత్పత్తుల తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవాలని కూడా ఈ ఒప్పందం ప్రస్తావిస్తోంది.

అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులను ఆరోగ్య అత్యవసర పరిస్థితులకు దీటుగా స్పందించేలా సిద్ధం చేయాలని, ఈ కార్యకలాపాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమన్వయానికి, ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకూ, అంతర్జాతీయంగా సప్లయ్ చెయిన్, లాజిస్టిక్స్ నెట్ వర్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది.

ప్రజారోగ్యం విషయంలో దేశాలకు ఉన్న సార్వభౌమ అధికారాలను గుర్తించే ఈ ఒప్పందం, అందులోని అంశాలు ఏ రకంగానూ డబ్ల్యూహెచ్ఓ ఇస్తున్న ఆదేశాలుగా భావించరాదని స్పష్టం చేస్తోంది. దేశీ విధానాలు, కార్యక్రమాలను మార్చుకోవాల్సిన అవసరమూ లేదని తెలిపింది. అంటే ప్రయాణీకుల నిలిపివేత, టీకాలు తప్పనిసరి చేయటం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టటం వంటివి.

**నిపుణుల ఆమోదం**

ఈ ఒప్పందం ఆమోదం పొందటంపై నిపుణులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య చట్టాల విషయంలో నిపుణుడైన అమెరికా న్యాయవాది లారెన్స్ గోస్టిన్ దృష్టిలో ఈ ఒప్పందం ఒక ఘన విజయం. ఒప్పందంపై విమర్శకులు కూడా లేకపోలేదు. అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ ఉండగా, రిపబ్లికన్ పార్టీ నేతలు, ఒక వర్గం మీడియా వ్యాఖ్యాతలు.. అమెరికా ఈ చర్చల్లో పాల్గొనటాన్నే తప్పుపట్టారు.

డబ్ల్యూహెచ్ఓ అమెరికా సార్వభౌమత్వంలో జోక్యం చేసుకుంటోందని ఆరోపిస్తూ ముసాయిదా ఒప్పందాన్ని తిరస్కరించారు. వాణిజ్యం, పర్యాటక రంగాలపై దీని ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేశారు. డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ ప్రభుత్వంగా మారే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత డబ్ల్యూహెచ్ఓ నుంచి ట్రంప్ వైదొలగటంతో ఈ ఒప్పందంపై చర్చలు వేగవంతమయ్యాయి. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సాగాయని కూడా చెప్పాలి.

ఇక్కడ ఒక కీలక విషయం గురించి చెప్పుకోవాలి. ఒప్పందాన్ని ఆమోదించిన దేశాల జాబితాలో అమెరికా లేకపోవటం హానికారక సూక్ష్మజీవులపై ప్రపంచవ్యాప్త నిఘా అన్న అంశాన్ని బలహీనపరిచేదే. సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి కూడా ఎంతవరకు సాధ్యమవుతుందన్నది చూడాలి. కాబట్టి ఆయా దేశాల స్థాయిలో వనరుల నిర్మాణం, ప్రాంతీయ స్థాయిలో సహకారం వంటి ఇతర మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ స్థాయి సవాళ్లకు అంతేస్థాయి స్పందన కూడా అవసరమవుతుంది. ప్యాండమిక్ ట్రీటీ ఈ దిశగా వెళ్లేందుకు తగిన చోదకశక్తిని ఇస్తోంది!.

★

# ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి





'నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానకు ..అనే పాట ఏళ్ల తరబడి సజీవంగా ఉంది. అయితే ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇప్పటికీ అనేక సమస్యలు ఉన్నా..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవఖానాల్లో పరిస్థితి చాలా వరకు మెరుగుపడింది. చాలా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందు తోంది. ఈ సేవలను ఉపయోగించుకోమని చేయాల్సిన ప్రచారాన్ని అటు ప్రభుత్వం కానీ, అధికార యంత్రాంగం గానీ చేయడం లేదు. ఏదైనా అనుకోని ప్రమాదమో.. అనారోగ్యానికో గురైతే వార్డు మెంబర్ నుంచి ముఖ్యమంత్రి దాకా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరిపోతున్నారు.

దీనివల్ల ప్రజలకు ఎలాంటి సందేశం అందుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రులు బాగుపడ్డాయని చెప్పే రాజకీయ నాయకులను.. మీకు పనికి రాని వైద్యం మాకు పనికి వస్తుందా? అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులదే.

ఈ ఏడాది జూన్ 30 నుండి జూలై 4 వరకు ఐదు రోజులు తెలంగాణలోని మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(FDR) ఆధ్వర్యంలో సర్వే జరిగింది. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మో హన్‌రావు ఆధ్వర్యంలో FDR సంస్థ యువ బృందం సుమేధ, లిఖిత, ఉదయ్ బృందం ఆరు జిల్లాల్లో పర్యటించింది.

గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రుల వరకు ప్రతి జిల్లాలో సందర్శించాము. పట్టణాలలో బస్తీ దవఖాన మొదలుకొని పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆసు పత్రులను సందర్శించాం. ఆస్పత్రుల్లోని పేషంట్లు, మెడికల్ సిబ్బంది, డాక్టర్ల వరకు అభిప్రాయ సేకరణ చేశాం. ఆయాఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వసతులు, ప్రభు త్వం అందిస్తున్న వైద్య సేవలతో పాటు అక్కడ అవసరమైన వసతులు, ఇంకా అందాల్సిన సేవలను ఒక సర్వే ఫారంలో నమోదు చేసుకున్నాం.

మేము ఒక్కొక్క ఆసుపత్రి సందర్శించిన సందర్భంలో ఒక్కొక్క రకమైన అనుభవం ఎదురైంది. లోక్‌సత్తా చేస్తున్న పని మంచిది అని అభినందించిన వారు ఎక్కువ మంది ఉంటే 'ఈ సర్వే తో మీకేంటి పని, మా ఆస్పత్రిలో ఈ సర్వే చెయ్యనివ్వం' అంటూ కొందరు ఉద్యోగులు దురుసుగానూ వ్యవహరించారు. ఆస్పత్రిలోకి రానివ్వమని ఖరాకండిగా చెప్పిన వారు కూడా కొందరు ఎదురయ్యారు. తెలంగాణలోని ప్రతి ఆరోగ్య కేంద్రం, ఆసుపత్రి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుంది. కానీ 2018 నుండి 2023 వరకు అలాగే ఇటీవల నియామకమైన యువ డాక్టర్లు సిబ్బంది పనితీరును గమనిస్తే చాలా ఆశావహ దృక్పథం కనిపించింది. ప్రభుత్వ ఆస్పత్రులను కాపాడుకోవాలి ప్రజారోగ్యాన్ని రక్షించాలి అనే తపన వాళ్ళలో కనిపించింది. ఒకనాటి ఆరోగ్య కేంద్రాల నుండి ఆసుపత్రుల వరకు ఉన్న వసతులు చాలా బాగుపడ్డాయి. అలాగే సౌకర్యాలు కూడా మెరుగయ్యాయి. పలు రక్త పరీక్షలు ఇతర సేవలు ఈ ఆసుపత్రులలో అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వచ్చిన రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి అక్కడే కొన్ని ఏర్పాట్లు ఉన్నచోట రిపోర్టులు పది నిమిషాలల్లోనే ఇస్తున్నారు. కొన్ని శాంపిల్స్‌ను జిల్లా కేంద్రం లో ఉండే టీ హబ్‌కు పంపుతున్నారు. రిపోర్టులు సంబంధిత పేషెంట్ల ఫోన్లకు చేరుతున్నాయి.

అందుబాటులో ఉన్న సాంకేతికతను ప్రభుత్వ ఆసుపత్రిలో అద్భుతంగా వినియోగించుకుంటున్నారు. ప్రతి పేషెంట్ దగ్గర ఆధార్ కార్డు సేకరించి వారికి ఒక మెడికల్ ప్రొఫైల్ తయారు చేస్తున్నారు. మేము ఉదయం పూట సందర్శించిన ఆరోగ్య ఉపకేంద్రం, బస్తీ దవాఖాన నుండి మొదలుకొని అన్ని ఆసుపత్రులలో గుమిగూడిన రోగులను మేము ప్రత్యక్షంగా చూశాం. ఒకనాటితో పోలిస్తే గ్రామీణ వైద్య



సేవలు మెరుగయ్యాయని చెప్పడానికి ఆ ఆసుపత్రులకు వచ్చే అవుట్ పేషెంట్స్ సంఖ్య ఒక మంచి దృష్టాంతం. ఆర్థికంగా వెనుకబడిన వారు, ఆర్థిక స్థితి మెరుగ్గా ఉన్న వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ ఆసుపత్రులను బాగా ఉపయోగించుకుంటున్నారు. మనం చెల్లించే పన్నుల డబ్బులతో ప్రజాధనంతో నడిచే ఆసుపత్రులను మనం ఉపయోగించుకోకుంటే ఇంకా ఎవరు ఉపయోగించు కుంటారన్న పేషంట్ల చైతన్యం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. ప్రభుత్వం ఇంత బాగా చేస్తున్నా కూడా దీనికి తగినంత ప్రచారం లేదని కొందరు ఆవేదన వెలిబుచ్చారు. రాజకీయ నాయకులకే కార్పొరేటు ఆసుపత్రులు ఉండడంవల్ల ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని కొందరు సామాజిక కార్యకర్తలు మాకు ఫిర్యాదు చేశారు. కుక్కను చంపాలంటే పిచ్చికుక్కగా ముద్ర వేయాలనే సామెతను ఉటంకిస్తూ ప్రజా ప్రతినిధులకు అధికారులకు ప్రభుత్వ ఆసుపత్రుల లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని చెప్పే బదులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మరికొందరు మాతో అభిప్రాయం పంచుకున్నారు. కొందరు అధికారులు కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న ఎక్సరే మిషన్, స్కానింగ్ లాంటి మిషనరీని కావాలని చెడగొడుతూ ఆ సేవలను బయట డబ్బు ఇచ్చి పొందాలని ప్రోత్సహిస్తున్నారనే చీకటి కోణం కూడా మాకు కనిపించింది. చాలాచోట్ల అద్భుతమైన మిషనరీ ఉన్నా కూడా వాటిని నిర్వహించడానికి అవసరమైన సిబ్బంది లేకపోవడం కూడా కనపడింది. వేల కోట్ల రూపాయలు వెచ్చించి ఆ మిషనరీలు కొని దాన్ని వాడకపోవడం వల్ల నిరుపయోగంగా మారిపోయాయి. ఆసుపత్రుల భవనాలు ఇతర మౌలిక సౌకర్యాలు ఎంత బాగా అభివృద్ధి అయినా  కూడా కొన్ని ఆస్పత్రులలో అవసరమైన డాక్టర్లు సిబ్బంది లేకపోవడం కూడా మరొక లోపం. కానీ ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది డాక్టర్లు అరకొరగా ఉన్నా కూడా పూర్తి సమయం కేటాయిస్తూ సేవలు అందించడం కూడా ప్రశంసనీయం.

**అంగన్‌వాడీ ఆశా వర్కర్ల సేవలు అమోఘం**

అంగన్‌వాడీలో ఇచ్చే పోషకాహారం ప్రజారోగ్యానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది. కానీ గ్రామీణుల అవగాహన లోపంతో ఆహారం స్వీకరించే క్రమంలో ప్రజల చైతన్యం లోపించడం వల్ల వెనుక బడింది. అయినా సరే అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఆ గ్రామాలలో ఉన్న చిన్నపిల్లలతో సహా గర్భిణీ స్త్రీలకు పోషక ఆహారం అందించడంలో గణనీయమైన సేవలు అందిస్తున్నారు. ఇక గ్రామాల ప్రజలకు ఆసుపత్రులకు అనుసంధానం చేసే ఆశా వర్కర్ల సేవలు మెరుగుగా ఉన్నాయి. జీతాలు తక్కువైనా, పని భారం ఎక్కువైనా తమ తమ వ్యక్తిగత కుటుంబ సమస్యలు ఉన్నా కూడా గ్రామీణ ప్రజారోగ్యంపై వారు పెట్టిన శ్రద్ధ మమ్మల్ని ఆశ్చర్య పరచింది. గ్రామాలు పేదల బస్తీలలో ఉన్న పేదలను రోజూ పలకరిస్తూ వారి అనారోగ్య సమస్యలను తెలుసు కుంటూ ఎప్పటికప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇచ్చే ఆశా వర్కర్లు వారి జీవితంలో అనేక చీకటి కోణాలు చవిచూస్తున్నారు. ప్రతి నెల మొదటి మంగళవారం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో జరిగే ఆశా వర్కర్ల సమావేశంలో అనేక విషయాలు చర్చించి కొత్త కార్యక్రమాలను తీసుకొని మళ్లీ గ్రామాలకు వెళ్లి ఆశ వర్కర్లు తమ సేవలు అందిస్తున్నారు. మేము తిరిగిన 6 జిల్లాలలో వివిధ రోజులలో జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో పాల్గొని వారిని అభినందించి వారితో మాట్లాడి వారు మరింత నిబద్ధతతో పని చేసే ప్రోత్సాహం ఇచ్చాము. అలాగే యువ డాక్టర్లతో కలిసి అనుభవం కలిగిన నర్సింగ్ సిబ్బంది కూడా అద్భుతమైన సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కానీ కొందరు నిరాశావాదులు ప్రభుత్వ ఆసుపత్రులు అంటే పనికిరానివి అనే ప్రచారం చేస్తూ వాటిని బదనాం చేస్తున్నారు. అవును ప్రభుత్వ ప్రజా ఆసుపత్రులలో కొన్ని లోపాలు ఉన్న మాట నిజమే కానీ గ్లాస్ లో సగం నీళ్లు ఉన్నాయన్నది ఆశావాదం. సగం నీళ్లు లేవనేది నిరాశవాదం గ్లాసులో సగం నీళ్లు ఉన్నది వాస్తవం నీళ్లు లేనిది కూడా వాస్తవమే.. కానీ కానీ






మనం ఏ పార్శ్యం చూపిస్తున్నామన్నదాన్ని బట్టి ఆశావహ నిరాశావాద దృక్పథాలు ఆధారపడి ఉంటాయి

మరి ఇంత అద్భుతంగా పనిచేస్తున్న ప్రజారోగ్య సంస్థలు ఎక్కడ విఫలం అవుతున్నాయి అంటే.. గ్రామాలలో ఉన్న ప్రైవేటు వైద్యులు వారిని ప్రోత్సహించే రాజకీయ నాయకత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న సౌకర్యాల కొరత చూపించి తాము సేవలు అందిస్తున్నామన్న ఆర్ఎంపీల వాదన కూడా ఒకరకంగా నిలుస్తుంది. ఇది నాణానికి మరొక పార్శ్వం మాత్రమే. కొందరు రోగులు ఇంజక్షన్ చేస్తేనే వైద్యం అందినట్లు భావించడం కూడా ఒక కారణం. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరం లేనిది ఇంజక్షన్ చేయడం లేదు కనుక ఆర్ఎంపీల వద్దకు రోగులు వెళ్తున్నారు. అనేక రుగ్మతలకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఖరీదైన మందులు ఇచ్చినా కూడా దానిపై MRP వేసి ఉండడం లేదు కనుక దాని విలువ ప్రజలకు తెలియడం లేదు. కొన్ని నొప్పుల మాత్రలు బయట మెడికల్ షాపులలో కొనుక్కుంటే 10 నుండి 20 రూపాయల ఖరీదు. అటువంటి నొప్పి నివారణ మందులు కూడా ఇచ్చినా వాటి విలువ తెలియకుండా రోగులు పెంటకుప్పలమీద పడేసిన సందర్భాలు మాకు కనిపించాయి. ఇటీవల గ్రామీణలో కూడా ఆహార వినియోగం జీవన విధానం మారి బీపీ, షుగర్ పేషెంట్‌లు పెరుగుతున్నారు. కనీసం షుగర్, బీపీ గోలీలు కూడా బయటే కొనుకుంటున్నారు తప్ప ప్రభుత్వం ఇచ్చే మందులు వాడడం లేదు. మందులు ఫ్రీ గా వస్తున్నాయి కనుక అవి పనిచేయవు అనే ఒక మూఢ నమ్మకం దీనికి కారణం. ఫ్రీగా ఇచ్చే మందు బిళ్ళలపై కూడా ఎమ్మార్పీ ధర వేసి అది ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందనే సూచన చేస్తే ఆ మందు విలువ తెలిసేది అని మరికొందరు సామాజిక సేవకులు ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. అవును కదా ఫ్రీ గా వచ్చేది పెద్దగా పనికిరానిది అనే భావన పోవాలంటే దాని విలువ తెలియాలి.

కొన్ని ఆసుపత్రులలో సిబ్బంది నిర్లక్ష్యం అహం కారం కూడా మాకు కనిపించాయి. కానీ చాలా వరకు బాధ్యతగా సేవలు అందిస్తున్న అందించిన వైద్య సిబ్బంది మాకు ఎక్కువగా కనిపించారు. కేవలం అధికారులు వైద్యులతో మాత్రమే సంప్రదించకుండా మా బృందంలో ఆయా వసతుల గురించి ఎక్కడికక్కడ తెలుసుకోవడంతో పాటు పేషంట్లను ఇంట ర్వ్యూ చేయడం ద్వారా ఆయా ఆస్పత్రుల పనితీరు మేము అంచనా వేయగలిగాం.


**ఆసుపత్రులలో మెరుగుపడిన పారిశుధ్యం**

ప్రభుత్వ ఆసుపత్రులు అంటే అపరిశుభ్రతకు మారుపేరుగా ఉంటాయన్న అపప్రద ఉంది. కానీ పారిశుధ్య పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల పీహెచ్‌సీల నుండి పై దాకా పారిశుద్ధ్య విషయంలో చాలా బాగా మెయింటైన్ చేస్తున్నారని మాకు అర్థమైంది. హుజురాబాద్ లో మహమ్మద్ కాజా అనే ఒక పారిశుద్ధ్య కాంట్రాక్టర్ తాము చేస్తున్న సేవలు గురించి ప్రస్తావిస్తూ మేము ఎంత పరిశుభ్రంగా ఉంచినా కూడా రోగులు దాన్ని మెయింటైన్ చేయలేకపోతే మళ్లీ మొదటి వస్తుందని వాపోయారు. అంటే రోగులు ఆయా వసతులను వాడుకునే క్రమంలో బాధ్యతతో ఎవరికి వారు అవగాహనతో వాడుకుంటే మరింత పారిశుధ్యం శుభ్రంగా చేయగలుగుతామని వారు అన్నారు.

మా సర్వేకు సహకరించిన వారి పేర్లు కూడా ఉటంకించడం సమంజసం. గజ్వేల్ జిల్లా ఆసుపత్రి అధికారి నరసింహులుతో పాటు లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు చెందిన న్యాయవాది బి. రామ్‌ఫణిధరరావు , యాదాద్రి భువనగిరి జిల్లా లోక్‌సత్తా నాయకులు దిడ్డి బాలాజీ, పాలకుర్తి రామ్మూర్తి, జంపాల అంజయ్యలు సహకరించారు. అలాగే వరంగల్ జిల్లాలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ రాష్ట్ర సలహాదారు పర్చా కోదండ రామారావు వారి ధర్మపత్ని కళ్యాణి ఆసుపత్రి అధినేత మెడికల్ డాక్టర్ అంజనీదేవి, జ్వాల అవినీతి వ్యతిరేక స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర వ్యవస్థాపకులు సుంకరి ప్రశాంత్‌లు సహకరించారు.

**-బండారు రామ్మోహనరావు**

# మా పర్యటన ఇలా సాగింది..




జూన్ 30 ఉదయం సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ సబ్ సెంటర్ సందర్శనతో మా పర్యటన మొదలైంది. ఆ రోజే కాకతాళీయంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వారు పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ప్రజారోగ్యంపై వారు ప్రచురించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించి ర్యాలీలో పాల్గొన్నాము. పారిశుద్ధ్య లోపంతో అంటువ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాము. తర్వాత గజ్వేల్ లో ఉన్న జిల్లా ఆసుపత్రి సౌకర్యాలను పరిశీలించి డాక్టర్లతో మాట్లాడాం. ఇదే జిల్లాలో తీగుల్ గ్రామంలో ఉన్న పీహెచ్‌సీ సూపరింటెండెంట్ నారాయణ సహకారంతో పరిశీలించాం.

అదే రోజు మధ్యాహ్నం యాదాద్రి భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తో పాటు ఒక బస్తీ దవాఖాన, జిల్లా ఆసుపత్రిని సందర్శించాము.

రెండో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక బస్తీ దవఖాన, హనుమకొండ జిల్లా పోచమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం



వరంగల్ జిల్లా పైడిపల్లి గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మరొక రెండు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశించాము. కరీంనగర్ జిల్లా కందుగల గ్రామ పల్లె దవాఖానతో పాటు అక్కడ హుజురాబాద్ తాలూకాకు చెందిన సుమారు 50 మంది అంగన్వాడి కార్యకర్తల సమావేశంలో పాల్గొని వారు పిల్లలకు గర్భిణిలకు ఇచ్చే ఆహారం అందించే సేవల గురించి తెలుసుకున్నాం. ఆ తర్వాత హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఒక కార్పొరేట్ ఆసుపత్రి లాగా ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దిన సూపరింటెండెంట్ నారాయణ రెడ్డి ద్వారా జిల్లాలోని అనేక ఆసుపత్రుల నిర్వహణ విషయాలు తెలుసుకున్నాము.

మూడవరోజు ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మంచిర్యాల జిల్లాలో మా పర్యటన ప్రారంభమైంది. మంచిర్యాల పట్టణంలోని సాయికుంట దళిత బస్తీ దవాఖాన సందర్శించాము. అక్కడి నుండి అదే జిల్లాలోని బెల్లంపల్లి పట్టణం లో ఒక బస్తీ దవాఖాన లో జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో పాల్గొని మా సర్వే ఉద్దేశాన్ని వివరించాము. ఆశావర్కర్లతో సేవలు గురించి తెలుసుకున్నాము. ఆ తర్వాత బెల్లంపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం తో పాటు వంద పడకల ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నాం.

అదేరోజు మధ్యాహ్నం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సాయంత్రం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రిని కూడా సందర్శించాం. జిల్లా ఆసుపత్రి సేవలతో పాటు అక్కడ బ్లడ్ బ్యాంకు అందిస్తున్న సేవలను సవివరంగా తెలుసుకున్నాము.

నాలుగో రోజు అదిలాబాద్ పట్టణంలోని చిలుకూరి లక్ష్మీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాం. ఆ బస్తీలో ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు వారి కోరికపై మేమే ప్రారంభించి రోగులతో ముచ్చటించాము. ఆ తర్వాత గిరిజన ప్రాంతంలో ఉన్న అంకోలి ప్రాథమిక ఆరోగ్యాన్ని సందర్శించి అక్కడ గిరిజనుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నాం. అక్కడ నుండి అదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్, ఇచ్చోడ గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి డాక్టర్లు , సిబ్బందితో మాట్లాడి విషయాలు తెలుసుకున్నాం.

ఇక చివరి రోజు జూలై 4న నిర్మల్ జిల్లా బాసరలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తోపాటు ఆయుష్ పథకం కింద నడుస్తున్న హోమియో వైద్యశాలను కూడా సందర్శించాం. ఆ తర్వాత నిజామాబాద్ జిల్లాలోని నవీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తోపాటు నిజామాబాద్ పట్టణంలోని అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం సందర్శించాము. అక్కడ నుండి బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి తోపాటు బాన్సువాడ ప్రభుత్వాసుపత్రి సందర్శించి పర్యటన ముగించాం. ★

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

Jugaad Bharat
United Voters

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Good governance Vote Jugaad July 2025

### Jugaad Bharat United Voters

### Simplifying Democracy - Strengthening Unity

### స్వజాతీయ నమూనా మార్పు - Model Political System

1947 ఆగస్టు 15న మన దేశాన్ని బ్రిటిష్ వారు పాకిస్తాన్ హిందుస్థాన్ అని మత ప్రాతిపదిక మీద విభజించడం జరిగింది. మూడు యుద్ధాల్తర్వాత, ఈసంవత్సరం ఏప్రిల్ నెల 22వ తారీకున మన కాశ్మీర్ లోకి పాకిస్తాన్ నుండి ఐదుగురు ఉగ్రవాదులు జొరబడి కాల్పులు జరిపి 26 మంది పర్యాటక యాత్రికులను, "మీరు హిందువులా" అని అడిగి తెలుసుకొని కాల్చి చంపడం యావత్ భారతదేశాన్ని కాకుండా యావత్ ప్రపంచాన్ని కలచి వేసింది. ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులలోనే మన హిందుస్థాన్ పాకిస్తాన్‌కి దీటుగా సమాధానమిచ్చిందన్న సంగతి మనకు తెలుసు. హిందువులైనా-ముస్లింలైనా, స్త్రీలైనా-పురుషులైనా ఎవరైనాసరే రాగ-ద్వేషాలకు అతీతంగా జీవించడం కష్టతరమైన పని. అందుకే మన ఓటర్లంతా కనీసం రాగద్వేషాలకతీతంగా పనిచేయగలిగిన నాయకులను ఎమ్మెల్యేలు ఎంపీలుగా సమర్థులను ఎన్నిక చేసుకోవాలి.

## Co operation based on trust - Jugaad Voters Government!

**(నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం)**

### MLA నియోజకవర్గం ప్రాతిపదికగా జుగాడ్ ద్విపక్ష పార్టీకి పునాదులు

ఓటర్లే క్రమశిక్షణతో పారదర్శకంగా పార్టీని నిర్వహించుకోవాలి. పదవులకోసం కీచులాడుకోకూడదు. చట్టబద్ధపాలన, అధికార-వికేంద్రీకరణ, ఆర్థిక-వికేంద్రీకరణ పార్టీలోనే జరిగితీరాలి. Jugaad పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తనకష్టార్జితమైన రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. అంత స్తోమతులేనివారు జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 2,000 కానీ ఇచ్చి మీవంతు భాగం మీరు తీసుకోండి.

జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు : (Rs/-10,000 donors)


**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH**

జుగాడ్ ఓటర్లు : **Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh M.Tech(36)Somanchi Radhakrishna**

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

advt

# అమెరికాలో ఘనంగా 'భారతీయత 2025'




ఏ దేశమేగినా సగర్వంగా బతికే చరిత్ర, సంస్కృతులు భారతీయుల సొంతమని, అమెరికాలో ఉంటున్నవారు రెండు దేశాల సంస్కృతులనూ ఆనందంగా పండుగలా జరుపుకోవాలని ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

భారతీయత ఒక భావం మాత్రమే కాదు ఒక జీవన విధానం సంప్రదాయానికి ఆలంబన ఆధునికతకి మార్గదర్శనం అనే అవగాహనతో 'భారతీయత 2025' సదస్సును సత్సంకల్ప ఫౌండేషన్ అమెరికా కనెక్టికట్‌లోని ఏవాన్ హైస్కూల్ వేదికగా నిర్వహించింది. న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం నుండి పీయూష్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో, జేపీ, గత సంవత్సర పురస్కార గ్రహీత ఉమా వైజయంతిమాల విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ప్రపంచం నలుమూలల నుండి 800 మంది ప్రేక్షకులు, కళాకారులు, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

శివానందమూర్తి స్ఫూర్తితో తాళ్లపాక శ్రీధర్ ఈ ఫౌండేషన్‌ని నెలకొల్పారు. భారతీయ ధర్మ విలువలు, జ్ఞాన సంపదలకు వేదికగా ఈ ఏడాది కార్యక్రమం జరిగింది.

సంగీతం, సాహిత్యం, విద్యా రంగాల్లో విశిష్ట సేవలందించిన డాక్టర్ శారదా పూర్ణ శొంఠి, తత్వశాస్త్రంలో లోతైన పరిశోధనలకు ప్రొఫెసర్ స్థానేశ్వర్ తిమిల్సిన, వైద్య సేవలతో పాటు ధార్మికం, సామాజిక సేవలో నిబద్ధతకు డాక్టర్ సుబ్బారావు బొల్లేపల్లికి ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక శివానంద స్మృతి పురస్కారాలను ప్రదానం చేశారు.

'అగస్త్య మహర్షి జీవితం, ఉపదేశాలు' పై ఈ సందర్భంగా ప్రదర్శించిన కళా కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సత్సంకల్ప సభ్యులు దీన్ని రూపొందించారు. శ్లోక పఠనం, చిత్రలేఖన పోటీలతో చిన్నారుల నైపుణ్యాలను ప్రోత్సహించారు. భారతీయత, ధర్మాలను ఎలా అనుసరించాలో, తద్వారా భారత్, అమెరికా పట్ల రుణాన్ని ఎలా తీర్చుకోవాలో శ్రీధర్ వివరించారు. భారతీయతలోని విలువలను గౌరవించటం, పాటించటం యువతకు ఏ విధంగా ప్రయోజనకరమో ఉమా వైజయంతిమాల తెలియచేశారు. ఒక పునఃస్మరణ, ఆత్మవిమర్శ, ధర్మపథానికి అనుసరణ స్ఫూర్తిగా ఈ ఉత్సవం జరిగింది. ★



ప్రభుత్వ – ప్రయివేటు, సంఘటిత – అసంఘటిత

# అంతరాల్ని తగ్గించేలా 8వ వేతన సంఘం సిఫార్సులుండాలి

ప్రభుత్వ నిర్వహణలో పాలనా యంత్రాంగం పాత్ర కీలక మైనది. పాలకుల నిర్ణయాల్ని కార్యక్రమాల్ని సమర్థంగా అమలు చేయటం ప్రభుత్వోద్యోగుల ద్వారానే సాధ్యం. అయితే అన్నిరంగాల్లో లెక్కేసినట్లు.. వారిపై చేసే వ్యయానికి, వచ్చే ఫలితాలకు మధ్య పొంతన ఉండేలా చూసుకోవటం కూడా అవసరం. ఇది ఆయా దేశాల ఆర్థిక వనరులు, పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉంటుంది.

**ప్రతి దేశానికీ అవసరం**

అయితే అమెరికాలో డోజ్‌లా కాకుండా ప్రతి దేశమూ ఒక క్రమ పద్ధతిలో, వివాదరహితంగా ప్రభుత్వోద్యోగ వ్యవస్థ పై వ్యయాన్ని ఎప్పటికప్పుడు హేతుబద్ధీకరించడం, వారి సామర్థ్యాలకు మెరుగులు దిద్దుతూ మార్కెట్‌తో పోటీపడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాల్ని సాధించటం అవసరం. రాజ్యాంగంలో ఇందుకు ఏర్పాటు ఉన్నా..చాలా సందర్భాల్లో, చాలా దేశాల్లో ఇది సమస్యగానే కొనసాగుతోంది. పాలకులకు ధైర్యం చాలకపోవటం, అవినీతిలో భాగంగా ప్రభుత్వోద్యోగులతో నేతలు కుమ్మక్కవటం, పాలనా యంత్రాంగాన్ని సంస్కరించాలని ప్రయత్నించి విఫలమ వ్వటమో, లేక పాక్షిక విజయాలతో సరిపెట్టుకోవటమో జరుగుతోంది. పూర్తిస్థాయి ఫలితాలను సాధించటం చాలా తక్కువగా, కొన్ని దేశాల్లో అరుదుగా జరుగుతోంది.

మన దేశంలో ప్రభుత్వోద్యోగ వ్యవస్థ ప్రక్షాళన మీద దృష్టి సారించటం చాలా కీలకమనిపించకమానదు.

జాతి నిర్మాణంలో గొప్పపాత్ర పోషించిన ప్రభుత్వోద్యోగులు భారత్‌లో అనేకమంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణ, విపత్తులను ఎదుర్కోవటం వంటి సందర్భాల్లో మన యంత్రాం గం గొప్ప పనితీరుని ప్రదర్శిస్తుంటుంది. అయితే ఒక వ్యవస్థగా మన పాలనా యంత్రాంగం ఇప్పటికీ పెద్ద సమస్యగా కొనసాగుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అడ్డుగోడల్ని పెంచుతోంది. ప్రజాస్వామ్యం వేళ్లూను కోనివ్వకుండా పెత్తందారీ రాజకీయం కొనసాగటానికి ఊతమిస్తోంది. బ్రిటిష్ వలసపాలన నాటి అధికార దర్పాన్ని ప్రదర్శించటం, జవాబుదారీతనం లేకపోవటం, ఒకసారి ఉద్యోగంలో చేరాక పనిచేసినా, చేయకున్నా జీవిత పర్యంతం భద్రతలో రిటైర్‌మెంట్ వరకూ కొనసాగటం, ఫిర్యాదు లొచ్చినా, ఆధారాలున్నా, చాలా సందర్భాల్లో ఉద్యోగానికి ఢోకా లేకపోవటం, మార్కెట్ కంటే అయిదారురెట్లు ఎక్కువ జీతం లభించడం, జీతం కంటే ఎక్కువ లంచాలొచ్చే అవకాశాలుండటం, పోటీ లేకపోవడం, రిటైర య్యాక ఆదాయపు పన్ను కట్టే స్థాయి పెన్షన్ వంటివి మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో పెద్ద సమస్యగా తయారయ్యాయి.

నిజానికి ప్రభుత్వోద్యోగుల జీతాల గురించి మౌలికంగా ఎవరికీ




అభ్యంతరం ఉండనక్కర్లేదు. కానీ దేశ జనాభాలో 80శాతానికిపైగా ఇప్పటికీ అసంఘటిత రంగంలో, ఏరోజుకారోజు అన్నట్లు అభద్రతలో, తక్కువ ఆదాయంతో బతుకుతున్నప్పుడు.. అవే పనులకు ప్రభుత్వంలో అనేకరెట్లు ఎక్కువ జీతాల్ని, పనిచేసినా చేయకున్నా ఇవ్వటం సమం జసం కాదు.

ప్రపంచంలో ఏ గణనీయ దేశంలోనూ లేనిరీతిలో భారత్‌లో ప్రభుత్వ – ప్రయివేటు, సంఘటిత –అసంఘటిత రంగాల మధ్య అసాధారణ అంతరం ఉండటానికి తోడు, రాజకీయ నాయకులు తమ అసమర్థతతో ప్రభుత్వోద్యోగాలే పరిష్కార మన్నట్లు హామీలు గుప్పించటం వల్ల.. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నయువత భ్రమల్లో తమ విలువైన కాలాన్ని తీవ్రంగా నష్టపోతున్నారు. నాణ్యమైన పాఠశాల విద్య అత్యధికులకు అందుబాటులో లేకపోవటంతో– అసలు విద్య అంటే ఏమిటో తెలియకుండా, తమ అభిరుచి, విద్యార్హత లతో సంబంధం లేకుండా, నైపుణ్యాలు లేకుండా, బట్టీపట్టి సంపాదించిన సర్టిఫికెట్లతో దిగువస్థాయి ఉద్యోగాల్లోకి ప్రవేశి స్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వందలు లేక వేల ఉద్యోగాలకు లక్షలాదిమంది పోటీని తట్టుకుని ఆ ప్రభుత్వోద్యోగం సాధించటమే వీరిలో ఎక్కువమంది సాధించిన ఘనత. అది కూడా పేపర్ల లీకేజీలు, లంచాలు లేకుండా అన్నీ సవ్యంగా జరిగితేనే.

**సానబట్టే వ్యవస్థ లేదు**

ఉన్నతస్థాయి సర్వీసుల్లోకి అత్యంత ప్రతిభావంతులు వస్తున్నప్పటికీ, ఎంపికైన తర్వాత కాలానుగుణంగా సానబట్టే వ్యవస్థీకృత ఏర్పాట్లు లేకపోవటంతో వాళ్లలో కూడా పలువురు క్రమంగా ఉదాసీనంగా తయారవుతున్నారు. అవినీతి వ్యవస్థతో రాజీపడి ప్రజాసేవ లక్ష్యాన్ని విస్మరిస్తున్నారు.

ఈ సమస్యలను పరిష్కరించి ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రశ్నించలేని, కనీసం ఆలోచించలేని స్థితిలో ప్రజల్లో ఎక్కువమంది ఉండగా.. ప్రభుత్వోద్యోగుల డిమాండ్లకు తలొగ్గటం తప్ప వారిని సంస్కరించే సాహసం మన రాజకీయ నాయకులకు లేకుండా పోయింది.

**అధికారులను నిలదీసిన దాఖలాలు లేవు**

ప్రభుత్వ పాఠశాల విద్యలో ఒక్కో బిడ్డ మీద ఏటా రూ.1,10,000 దాకా ఖర్చు పెడుతున్నా పిల్లలకు చదువెందుకు రావటం లేదు అని అధికారులను ప్రజలు, పాలకులు నిలదీసిన దాఖలాలు లేవు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి గణాంకాలతో కొంతమేర సమస్యను లేవనెత్తుతున్నారు. అధికార యంత్రాంగం సమర్థంగా వ్యవహరిస్తే దేశంలో సగం సమస్యల్ని పరిష్కరించవచ్చు. కానీ పట్టించుకునేవాళ్లు తక్కువ. ఈవేళ ఒక్క రూపాయి కూడా జమ చేయకుండా భవిష్యత్తు తరాలపై మోయలేని భారం వేసే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న ప్రభుత్వోద్యోగ సంఘాల డిమాండ్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గట్టిగా, కారణాలు వివరిస్తూ గొంతువిప్పే దాకా, దానివల్ల దేశానికి ఎంతో వినాశకర నష్టం వస్తుందో, ఎన్నికల్లో ఓపీఎస్ హామి నివ్వటం ద్వారా కొన్ని పార్టీలు ఎంత దేశద్రోహకరంగా వ్యవహరించాయో పలువురు నేతలకు, సమాజానికి, మీడియాకి, చివరికి పౌర సమాజ ఆలోచనాపరులకు కూడా బోధపడలేదు.

ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, సర్కారీ కొలువులపట్ల మోజు తగ్గించేలా, మన సమాజానికి తగ్గరీతిలో జీతభత్యాలు, పెన్షన్లను హేతుబద్ధీకరించేలా జవాబుదారీతనం, పోటీ పెంచేలా సామర్థ్యానికి ప్రోత్సహకాలుండేలా మార్పులు, చేర్పులు చేయాల్సిన ఈ నేపథ్యంలో – యూనియన్ ప్రభుత్వం 2025 ప్రారంభంలో 8వ వేతన సంఘాన్ని ప్రకటించింది. దాదాపు 50లక్షల మంది ప్రభుత్వోద్యోగులు, 65 లక్షలమంది పెన్షన్ దారులకు దీనివల్ల లబ్ధి కలగనుంది అంచనా. వివరాలు పూర్తిగా బయటకు రాకున్నా ఫిట్‌మెంట్ 2.5 నుండి 2.86 మధ్య ఉండొచ్చని, దీనివల్ల కనీస బేసిక్ వేతనం ఇప్పుడున్న రూ.18,000 నుంచి రూ. 51,000 పైగా పెరగొచ్చన్న ఊహ గానాలు వినిపిస్తున్నాయి. గరిష్టంగా గ్రాస్ వేతనం రూ.2,35,920కి పెరగొచ్చంటున్నారు. అయితే 8వ వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చాక రిటైరనవారికి మాత్రమే పెంపు ప్రయోజనాలు వర్తించేలా ఆర్థిక బిల్లును మార్చి బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం పార్లమెంటు ఆమోదింపచేసుకుంది. దీంతో కొత్త వేతన సంఘం ప్రయో జనాల ప్రభావం ఎంతమంది మీద ఏమేరకు ఉంటుందో కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. మరోవైపు ఇవన్నీ అనవసర ఊహాగానాలు మాత్రమేనని, గతంలో పద్ధతుల్నే ఆర్థిక బిల్లుతో మళ్లీ చెప్పామని ఆర్థికమంత్రి అంటున్నారు. ప్రభుత్వం విచక్షణ మేరకు అమలు చేస్తుందని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ అభిప్రాయాల్ని, 8వ వేతన సంఘం ఏర్పాటు జాప్యాన్ని అలా ఉంచితే, మన పన్నుల డబ్బుని వేతన సంఘం ద్వారా ఎలా ఖర్చు చేయాలో కొన్ని ప్రాతిపదికల్ని పౌర సమాజం నుండి మనం స్పష్టంగా చెప్పటం అవసరం.

గత వేతన సంఘం కంటే అన్నిరకాలుగా ప్రయోజనాల్ని పెంచటమే లక్ష్యం కాకుండా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, సమ్మిళిత అభివృద్ధి అవశ్యకత, ఉపాధి మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని కమిషన్ సిఫార్సులు ఉండటం అవసరం. ప్రభుత్వ – ప్రయివేటు రంగాల ఉద్యోగుల్లో ఆదాయ అంతరాల్ని తగ్గించేలా, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కోట్లాదిమందిని సంఘటిత రంగం లోకి తెచ్చి జీవన భద్రతను కల్పించేలా దేశ తలసరి ఆదాయానికి తగ్గట్లు చర్యల్ని సూచించాలి.

ప్రజాప్రయోజనాలు అనే గీటురాయితో నిశితంగా పరిశీలించి ప్రభుత్వం రాజకీయాలకతీతంగా 8వ వేతన సంఘం అమలు చేయటం అవసరం. రాష్ట్రం విడిపోయినప్పుడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ 42శాతం ఫిట్‌మెంట్ అమలు చేసిన రీతిలో చేయకూడదు. రాష్ట్రాలకు మార్గదర్శకంగా ప్రభుత్వోద్యోగం అంటే వేలంవెర్రి లేకుండా, కేవలం ప్రజాసేవ పట్ల తపన, తాము ఎంచుకున్న రంగంలో ఆసక్తి, నైపుణ్యం ఉన్నవారు మాత్ర మే వాటి కోసం ప్రయత్నించే పరిస్థితి వచ్చాక, ఆ రకంగా జీతభత్యాలు, ఇతరత్రా అంశాలను హేతుబద్ధీకరించాక..'డోజ్' లా సంచలనం లేకుండా సమీక్షించుకుని అవసరమైతే ఉద్యోగులను పెంచటం సమంజసమవుతుంది. ★

**ఒక తప్పు చేద్దామంటే, అధికారులు మూడు చేద్దామంటున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు ఏదైనా ప్రస్తావిస్తే.. అధికారులు అందులోని లోటుపాట్లను విశ్లేషించేవారు. కానీ ఇప్పుడేమో.. ఒక తప్పు చేద్దామంటే, మూడు చేద్దామనే అధికారులను చూస్తున్నాం. గతంలో ఐఏఎస్ లు ప్రజాసమస్యలు పరిష్కారానికి ఎంతో శ్రమించేవారు. ప్రజలు అంతే గొప్పగా వారి గురించి మాట్లాడుకునేవారు. కానీ ఈవేళ వారిలో చాలామంది ఏసీ గదులు విడిచి బయటికి వెళ్లటం లేదు. కొత్తగా ఎంపికైన ఐపీఎస్ లలో కొందరు శిక్షణలో ఉన్నప్పుడే యూనిఫాం వేసుకుని మరీ ప్రయివేటు పంచాయితీలు చేస్తున్నారు. ఈ ధోరణులు సమాజానికి మంచిది కాదు. కొంతమందిలోనైనా మార్పు రావాలని ఈ విషయం చెబుతున్నా.**

**–'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి–**
**మెమోయిర్ ఆఫ్ ఎ సివిల్ సర్వెంట్'**
**పుస్తకావిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి**
**రేవంత్ రెడ్డి**

---

**ముఖ్యమంత్రి మాటల్లో వాస్తవముంది**

ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగితే ప్రజల సమస్యలు బాగా తెలుస్తాయని సీనియర్ ఐఏఎస్ అధికారి, ఢిల్లీ లోని తెలంగాణ భవన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్ అన్నారు. ఐఏఎస్ అధికారు లు క్షేత్రస్థాయిలోకి వెళ్లటంలేదని ఇటీవల ముఖ్య మంత్రి రేవంత్ చెప్పిన మాటల్లో వాస్తవముందని, ఆ మాటల్ని ప్రతి అధికారీ సానుకూలంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

# తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..కోర్టు తీర్పు..పరిష్కారాలు

- బండారు రామ్మోహనరావు

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఆలస్యం అయినందున వెంటనే వచ్చే సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికలు జరపాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. రోగి కోరింది అదే వైద్యుడు ఇచ్చింది అదే అన్నట్లు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. పంచాయతీల డిలిమిటేషన్ రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక నెల సమయం అడిగింది. డిలిమిటేషన్ రిజర్వేషన్ ఖరారు కాగానే ఎన్నికలు నిర్వహించడానికి మరొక రెండు నెలలు సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోరింది. ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కోరిన విధంగా మూడు నెలల టైం ఫిక్స్ చేస్తూ సెప్టెంబర్ 30వ తేదీ లోగా తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరగాలని హైకోర్టు తీర్పు




ఇచ్చింది.

ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్, బీజేపీ, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకుల మధ్య బీసీ కులాల రిజర్వేషన్ల అంశం మరొకసారి తెరపైకి వచ్చింది. పార్టీల మూడుముక్కల ఆటలో పరస్పర విమర్శలు ప్రతి విమర్శలతో చాలా వాస్తవాలు మరుగున పడుతున్నాయి.

ఇటీవల జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మరణించారు. ఆ స్థానం ఖాళీ అయినట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే సమాచారం అందింది. వచ్చే ఐదు నెలల లోగానే ఎన్నికలు జరగాల్సి ఉంది. పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలు ఖాళీ కాగానే ఆరు నెలల లోపే ఎన్నికలు జరుగుతున్నప్పుడు పంచాయతీ ఎన్నికలతో పాటు మండల, జిల్లా పరిషత్ స్థాయిలో స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు ఎందుకు జరగడం లేదనేది పెద్ద ప్రశ్న. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే మిగతా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల డిలిమిటేషన్ దేశవ్యాప్తంగా 2001 తర్వాత మళ్లీ 25 ఏళ్లకు వాయిదా పడ్డాయి. కనుక 2026లో వచ్చే జనాభా లెక్కల తర్వాత వచ్చే డిలిమిటేషన్ దాకా 25 ఏళ్లు అప్పుడు ఖరారు చేసిన నియోజకవర్గాల సంఖ్య అలాగే ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లే కొనసాగుతున్నాయి. ఇక్కడ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ప్రతిసారి ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఒకసారి అసెంబ్లీ పార్లమెంటు పునర్విభజన పూర్తయితే వాటి ప్రకారం ఎన్నికలు, అవసరమైతే ఉప ఎన్నికలు జరుపుతూనే ఉంటుంది. కానీ పంచాయతీ మండల జిల్లా పరిషత్ పదవీకాలం పూర్తి కాకముందే మూడు నెలల ముందస్తుగానే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు వెంటనే ఎన్నికల జరపడానికి ఇక్కడనే చిక్కు వచ్చింది. దీన్ని అర్థం చేసుకుంటే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఉన్న పరిధి, పరిమితి అర్థమవుతుంది.

తెలంగాణలో 2024 జనవరి 31 నాటి కంటే కనీసం మూడు నెలల ముందుగానే పంచాయతీ వార్డు మెంబర్లు ,సర్పంచుల రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. చట్టపకారం ఈ పదవులకు గడువు ముగిసే మూడు నెలల ముందు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించడానికి 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న రాజ్యాంగం ప్రకారం కావలసిన ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉంది. కానీ ప్రతిసారి ఎన్నికల కమిషన్ ఈ విషయంలో విఫలం అవుతుంది. దానికి సహేతుకమైన కారణం కూడా ఉంది. 73వ రాజ్యాంగ సవరణలలోనే నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేతిలో పెట్టారు. దాంతో అది చేయకుండా ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించలేదు. ఉదాహరణకు పంచాయతీలో ముందుగా వార్డు స్థానాలు ఖరారు కావాలి. ఆ తర్వాత వార్డ్ మెంబర్లతో సహా గ్రామపంచాయతీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్ ఖరారు కావాలి. అది చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారు. అందుకే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా పంచాయతీతో పాటు ఎన్నికలు సకాలంలో జరగక పోవడానికి అది ప్రధాన కారణం అవుతుంది. అందుకే 2006 తర్వాత 2011లో జరగాల్సిన ఎన్నికలు 2013 దాకా వాయిదా పడ్డాయి. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగింది. 2018లో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలు 2019 దాకా జరగలేదు. ప్రతి సారి స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, సర్పంచుల సంఘాలు గాని కోర్టుకు వెళ్తే తప్ప ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సరిగ్గా 5 ఏళ్లకు ఎన్నికలు జరిగిన సందర్భాలు చాలా అరుదు. ఇది మారా లంటే చట్ట పరంగా స్థానిక ప్రభుత్వాలలో నియోజక వర్గాల రిజర్వేషన్ల ఖరారు అధికారాన్ని ఒక ప్రత్యేక సంఘానికి అప్ప జెప్పితే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం ఏమీ ఉండదు. దాని కి 73వ రాజ్యాంగ సవరణలో చిన్న మార్పు తప్పక అవసరం.

**పంచాయతీ ఎన్నికలకు బీసీ రిజర్వేషన్లు అడ్డమా?**

ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు వాయిదా పడడానికి మరొక కారణం కూడా ఉంది. అదేమిటంటే కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో సభ నిర్వహించి ..పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు అన్ని పదవులలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని చెప్పింది. కానీ గతంలో సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ఏ రిజర్వేషన్లు అయినా సరే 50% మించ కూడదు అనే షరతు విధించి తీర్పు నిచ్చింది ఆ తీర్పు వల్లనే తెలంగాణలో 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మినహాయించి మొత్తానికి 50 శాతం రిజర్వేషన్లకు లోబడి బీసీలకు 22 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కాయి. అంతకుముందు 73, 74వ రాజ్యాంగ సవరణలు రాకముందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారి హయాంలో స్థానిక ప్రభుత్వాలలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇచ్చారు. పైగా గ్రామ వార్డు మెంబరు సర్పంచి తో పాటు అంతకుముందు ఉన్న పంచాయతీ సభ్యుల స్థానంలో వికేంద్రీకరణ చేసి మండల వ్యవస్థను ప్రవేశపెట్టారు. అలా ఏర్పడిన మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్తుల అధ్యక్షులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిం చారు. ఆ తర్వాత 2013 వరకు జరిగిన ఎన్నికల్లో 34% బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చారు. చివరగా 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సుప్రీంకోర్టు ఇచ్చిన రిజర్వేషన్ల పరిమితి తీర్పును ఉదహరిస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు 50 శాతం రిజర్వేషన్లు మించి ఇచ్చే పద్ధతిని ఇదే చివరిసారి బీసీ రిజర్వేషన్లు తో కలిపి 50% మించి అనుమతిస్తున్నామని ఇకముందు అనుమతించేది లేదని హెచ్చరిస్తూ చివరిసారిగా అనుమతించారు. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 2019లో జరిగిన ఎన్నికల్లో సుప్రీంకోర్టు,హైకోర్టు తీర్పుల మేర కు బీసీ రిజర్వేషన్లు 22 శాతానికి తగ్గించవలసి వచ్చింది. ఇది స్థానిక ప్రభుత్వాలలో బీసీ రిజర్వేషన్ల నేపథ్యం.

**రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఏం చేయాలి?**

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలంటే హైకోర్టు సుప్రీం కోర్టు తీర్పులను పాటించకుండా ఉండలేరు, అలాగని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల హామీ ఇచ్చిన మేరకు బీసీ రిజర్వేషన్లకు 42 శాతం పెంచాల్సిన అవసరం ఏర్పడింది. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు జరుపుతామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 నవంబర్ లో బీసీ కులగణన ను నిర్వహించింది. ఆ తర్వాత ఆ లెక్కలను అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. దీనిపై పలు విమర్శలు వచ్చాయి. ప్రతిపక్షాలతో పాటు బీసీ సంఘాలు పలు ఆరోపణలు చేశాయి. ఎన్ని విమర్శల వచ్చినా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వం తాను చేసిన బీసీ కులగణన లెక్కలను చూపుతూ 42% రిజర్వేషన్లు స్థానిక ప్రభుత్వాలలో అనుమతించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని కోరుతుంది. ఆ చట్టాన్ని ఎవరైనా సుప్రీంకోర్టులో సవాలు చేయకుండా తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కేంద్రం ఆ బిల్లును పరిశీలిం చకుండా తొక్కి పెట్టింది. ప్రస్తుతం ఆ బిల్లు కేంద్ర ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే పంచాయతీ ఎన్నికలలో 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వడం వీలుకాదు. ఇక రెండవ ఆప్షన్ అప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది ఒక ఆర్డినెన్స్ ద్వారా ఎన్నికలకు వెళ్లి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని దానికి వ్యతిరేకంగా ఏ పార్టీ కోర్టుకుపోయినా వారిని ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడదామని ప్రయత్నం చేస్తుంది. ఈ సవాలకు బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు స్పందిస్తూ మమ్మల్ని కోర్టుకు పోకుండా ఆపగలుగుతారేమో కానీ తెలంగాణ లో ఉన్న 4 కోట్ల మంది ప్రజలలో కోర్టుకు వెళ్లకుండా ఎంతమందిని ఆపుతారని ప్రశ్నిస్తున్నాయి. దాంతో అధికార కాంగ్రెస్ మరొక ఎత్తుగడ వేసింది రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వలేకపోయినా కూడా మేము వార్డు మెంబర్ నుంచి మొదలుకొని సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి పదవులకు పార్టీ పరంగా 42% రిజర్వేషన్లు ఇస్తామని సవాలు విసురుతుంది."హామీ మీది ఆచరణ మాదా" అంటూ ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాయి.

సెప్టెంబర్ 30లోగా పంచాయతీ ఎన్నికల జరపాలని హైకోర్టు తీర్పు మేరకు ఎన్నికలు జరపాలంటే బీసీ రిజర్వేషన్ల హామీని అమలు చేయలేని పరిస్థితి ఉంది. కానీ కోర్టుకు ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలు జరపాల్సి ఉంది. కనుక రాష్ట్ర ప్రభుత్వం ముందున్న మార్గాలు... ఈ లోగానే హైకోర్టులో సింగిల్ బెంచి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌కి అప్పీలుకు పోవ దం ఒక మార్గం లేక సుప్రీంకోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పుపై స్టే తీసుకు రావడం మరో మార్గంగా కనబడుతుంది. కానీ హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నెల రోజుల్లో ఇవన్నీ జరుగు తాయా అనేది కూడా అనుమానమే!!!.

**స్థానిక ప్రభుత్వాలలో జమిలి ఎన్నికలు పరిష్కారమా?.**

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కూడా జరపాల్సి ఉంది. కనుక ఈ ఎన్నికలన్నీ కలిపి ఒకేసారి జరిపితే ఇంకా బాగుంటుందని ఒక ఆలోచన ప్రజలలో ఉంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అని కేంద్ర ప్రభుత్వం అంటుంది కనుక కనీసం రాష్ట్రంలో అన్ని స్థాయిలలో పదవీకాలం పూర్త యిన గ్రామ,మండల, జిల్లా పరిషత్‌తో పాటు మున్సిపాలిటీలు కార్పొరేషన్ల ఎన్నికలు కూడా ఒకేసారి జరిపిస్తే మరొక ఐదేళ్ల వరకు ఈ ఎన్నికల ప్రసక్తి ఉండదని కొందరు సూచన చేస్తున్నారు.ఏదేమైనా స్థానిక ప్రభుత్వాల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి సంవత్సరాల తరబడి ఇలా ఖాళీగా ఉం డటం వల్ల గ్రామ,పట్టణ పాలన అస్తవ్యస్తమైందని పారిశుధ్యం లోపించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లేక ప్రజల సమస్యలు తీరడం లేదని వీలైనంత త్వరగా ఎన్నికలు జరపడమే దీనికి పరిష్కారమని ప్రజలు పేర్కొంటున్నారు. ✭

# బడి చదువుల బాగుకి పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు



తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు అభ్యసన సామర్థ్యాలలో అత్యంత వెనుకబడ్డారని వివిధ సర్వేలు వెల్లడిస్తున్న నేపథ్యంలో మార్పు తెచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ తాజాగా సమాయత్తమైంది. గత మూడు విద్యా సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ – ఎఫ్ఎల్ఎన్), అభ్యసన పురోగతి కార్యక్రమం (లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రాం – లిప్) పటిష్ట అమలుపై దృష్టి సారించింది. అందులో భాగంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి ఆయా విభాగాల అధిపతులు, అదనపు డైరెక్టర్, సంయుక్త సంచాలకుడు, ఇతర రాష్ట్ర అధికారులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి – వివరాలను యాప్‌లో నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ అధికారులు పాఠశాలల సందర్శనకు వెళ్లినప్పుడు ఒక్కోచోట కనీసం మూడు గంటలు గడపాలని, ఒక పీరియడ్ అంతా (45 నిమిషాలు) తరగతి గదిలో కూర్చుని ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించ టంతో పాటు.. సంబంధిత ఉపాధ్యాయుడికి తమ అభిప్రాయాన్ని (ఫీడ్ బ్యాక్) అందించాలని నిర్దేశించారు. సిబ్బంది సమావేశం నిర్వహించి ఆయా వివరాలను పాఠశాలలోని విద్యాకరదీపిక (అకడమిక్ గైడెన్స్ రిజిస్టర్ – ఏడీఆర్)లో నమోదు చేయటంతో పాటు – సందర్శన వివరాలను, ఫొటోలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.

**పాఠశాల విద్యాశాఖ ఆదేశాల్లోని ముఖ్యాంశాలు**

**పర్యవేక్షణ బృందాలు సందర్శించాల్సిన పాఠశాలల సంఖ్య – వివరాలు**

| అధికారి స్థాయి | వారంలో ఎన్నిరోజులు | నెలలో ఎన్నిరోజులు |
|---|---|---|
| హెచ్ఓడీ రాష్ట్రస్థాయి అధికారులు | 2 | 8–10 |
| ఆర్జేడీలు | 3–4 | 12–16 |
| డీఈఓలు | 3–4 | 12–16 |
| ఎంఈఓలు | 5–6 | 20–24 |
| కాంప్లెక్స్ హెచ్ఎంలు | 4–5 | 16–20 |

ప్రతి నెలా 28న జిల్లాలో, 29న రాష్ట్ర స్థాయిలో సమావేశం. నెల రోజులపాటు పాఠశాలలను సందర్శించిన తర్వాత ప్రతినెలా 28వ తేదీన డీఈఓలు జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించాలి. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలతో పాఠశాలల సందర్శన, తరగతి గది పరిశీలన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలలో పురోగతిని సమీక్షించి అభిప్రాయాలు సమీకరించాలి. ఆ తర్వాతి రోజు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్..రాష్ట్రస్థాయి అధికారులైన విభాగాధిపతులు, అదనపు డైరెక్టర్లు, సంయుక్త డైరెక్టర్లు, డీఈఓలు, సమగ్ర శిక్ష విభాగంలోని జిల్లా కో ఆర్డినేటర్లు, రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణమండలి (ఎన్ సీఈఆర్టీ) నిపుణులు, ఇతర రాష్ట్ర అధికారులతో సమీక్షించాలి. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎఫ్ఎల్ఎన్ విభాగాలు నెలకొల్పాలి. ఎఫ్ఎల్ఎన్ అమలు బాధ్యత ఈ విభాగాలదే.

**ఏడాదిలో మూడుసార్లు పరీక్షలు**

1-5 తరగతుల కోసం ఎఫ్ఎల్ఎన్, 6-9 తరగతుల విద్యార్థులకు లిప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో



.. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా చేసేందుకు మూడుసార్లు పరీక్షలు నిర్వహించాలి. తొలుత జూన్ 25-30 తేదీల మధ్య నిర్వహించిన బేస్ లైన్ పరీక్ష ఫలితాలను జులై 15వ తేదీలోపు స్కూల్ ఎడ్యుకేషనల్ యాప్‌లో నమోదు చేయాలి.

❖ రెండో పరీక్ష (మిడ్ లైన్) నవంబర్ 25-30లో, తుది పరీక్ష (ఎండ్ లైన్) మార్చి 5-7 తేదీల్లో నిర్వహించాలి. వాటి ఫలితాలను మార్చి 30వ తేదీలోపు యాప్‌లో నమోదయ్యేలా చొరవ చూపాలి. ప్రశ్నాపత్రాలను ఎస్సీఈఆర్టీ నుంచే పంపిస్తారు.

**వారానికి 80 నిమిషాలపాటు ఏఐ ఆధారిత చదువు**

గత విద్యా సంవత్సరం చివరి నుంచి పలు ప్రాథమిక పాఠశాల్లలో కృత్రిమ మేధ ఆధారంగా గణితం, తెలుగు, ఇంగ్లిష్ పాఠాలు బోధిస్తున్న సంగతి తెలిసిందే. అందుకు వారంలో రెండుసార్లు 80 నిమిషాలు కేటాయించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో 6 స్వచ్ఛంద సంస్థల అత్యాధునిక సాంకేతిక బోధన**

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించేందుకు ఆరు ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖ ఆ సంస్థలతో అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఈ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ బడుల్లో ఎడ్ టెక్ సదుపాయాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని సర్కారీ పాఠశాలల్లో బోధన నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఏ సంస్థ .. ఏ సేవలు..**

❖ నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్ స్టెప్ ఫౌండేషన్..కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్లాట్ఫామ్ తో 540 పాఠశాలల్లో ఇప్పటికే పని చేస్తోంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో అయిదువేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు తన సేవల్ని విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు, గణితంలో ప్రాథమికాంశాలను ఈ సంస్థ బోధిస్తుంది.

❖ఫిజిక్స్‌వాలా.. ఇంటర్ విద్యార్థులను నీట్, జేఈఈ, క్యాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల్లో దృక్కోణంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తుంది.

❖ ఖాన్ అకాడమీ.. రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందచేస్తుంది.

❖ ప్రజ్వల ఫౌండేషన్.. 6-12 తరగతుల విద్యార్థులకు బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది.

❖ పైజామ్ ఫౌండేషన్.. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్ పై శిక్షణనిస్తుంది.

❖ ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ.. రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16వేలమందికి పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు %-% బాలికల అక్షరాస్యత, విద్యావకాశాలను మెరుగుపరుస్తుంది.

★

# మూసీ సుందరీకరణ, ప్రపంచ సుందరి పోటీలు

తెలంగాణ ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి కావటానికి ముందు రెండు నెలల్లో రెండు ఈవెంట్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. అవి ఏప్రిల్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్, మే మాసంలో జరిపిన మిస్ వరల్డ్ పోటీలు! తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచటానికి ఈ ఈవెంట్లను నిర్వహించినట్లు ప్రభుత్వ ప్రకటనలు పేర్కొ న్నాయి. ప్రజల పన్నుల డబ్బుతో వీటిని నిర్వహించటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సాధించిందేమిటో పరిశీలిద్దాం.

**భారత్ సమ్మిట్**

చాలాపెద్ద ఎజెండాతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని చర్చించటానికి, పరిష్కారాలు కనుగొనటానికి 100కు పైగా దేశాల నుంచి 450కి పైగా ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. వీరిలో సామాజిక, ప్రజాస్వామ్య, సామ్యవాద, కార్మిక ఉద్యమాలకు చెందిన ప్రతినిధులున్నారు. అదేవిధంగా, ప్రగతి శీల రాజకీయ పార్టీలకు చెందినవారు, 40-50మంది మంత్రులు, 50మంది సెనెటర్లు, పార్లమెంటు సభ్యులు, సుమారు 25 థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ 140వ వార్షికోత్సవం, నెహ్రూ నేతృత్వంలో అలీన ఉద్యమానికి నాంది పలికి 70ఏళ్ళవటం ఈ సమావేశానికి సందర్భాలని, సమృద్ధ భారత్ ఫౌండేషన్ తో కలిసి ఈ చారిత్రక కార్యక్రమాన్ని నిర్వహించటం మనకి గొప్ప అవకాశమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. భారత విదేశాంగశాఖ కూడా ఈ కార్యక్రమానికి తోడ్పాటు నందించింది. చర్చల అనంతరం 'భారత్ సమ్మిట్ తీర్మానం' పేరుతో కొన్ని లక్ష్యాల్ని ప్రతిపాదించారు.

**అందులోని కొన్ని ముఖ్యాంశాలు:**

➤ ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాల పరిష్కారానికి ఏకమవుదాం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను సమర్థంగా తీర్చిదిద్దుదాం.

➤ ఉగ్రవాదాన్ని, అందుకు మద్దతిస్తున్న దేశాల వైఖరిని ఖండిద్దాం.

➤ స్నేహం, దయ, అహింస, సత్యం, న్యాయం, వసైదైక కుటుంబకం, అంతర్జాతీయ న్యాయం అందించే ప్రగతిశీల విధానాలు, శాంతియుత పద్ధతుల్ని అనుసరిద్దాం.

➤ సుంకాలు, హింస, వలసవాద ధోరణుల్ని నిరసిద్దాం.

➤ అతివాద, నిరంకుశ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయి. అతివాద శక్తుల అధికార కేంద్రీకరణను వ్యతిరేకించటం, లింగ సమానత్వం, పౌర హక్కులు, వాక్ స్వాతంత్ర్యం, మీడియా స్వేచ్ఛలను పరిరక్షించటం ప్రధాన ఎజెండా కావాలి.

➤వాతావరణ మార్పులపై ఏకాభిప్రాయంతో కృషి చేయటం

➤పేదరికాన్ని నిర్మూలించేలా ఆర్థికవ్యవస్థ నమూనా రూపకల్పన.

➤ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవటంతో పాటు, మహిళలకు తగిన ప్రాతినిధ్యం.

తీర్మానంలోని ఈ అంశాలన్నీ చాలా విలువైనవి. కానీ ఇవన్నీ చూస్తే ఒక దేశమో, ఐక్యరాజ్య సమితో, పౌర సమాజ సంస్థో నిర్వహించాల్సిన కార్యక్రమంలా ఉంది తప్ప.. ఒక రాష్ట్ర ప్రభుత్వం, ఫెడరలిజం ఎంత బలంగా విస్తరించినా కూడా, నిర్వహించటం కొంత ఎబ్బెట్టుగా ఉంది. ప్రధానమంత్రి లాంటివారిని ఆహ్వానించినా కొంత అర్థవంతంగా ఉండేది. బాండుంగ్ సమావేశాలన్ని ఒక దేశ ప్రధానమంత్రి హోదాలోనే నెహ్రూ నిర్వహించారు గదా! అనేక దేశాలు ఇందులో భాగస్వాములై ఉన్నాయి, అంతేకాకుండా, ఇప్పటికీ మన విదేశాంగ విధానంలో, అలీన ఉద్యమ ప్రభావంతో పెరిగిన స్వతంత్ర వ్యవహారశైలి కనిపిస్తుంది. ఇక, కాంగ్రెస్ పార్టీ 140వ వార్షికోత్సవం అనుకున్నప్పుడు, అలీనోద్యమ ఆవిర్భావ బాండుంగ్ సమావేశాన్ని కలపకుండా పార్టీ కార్యక్రమంగా నిర్వహించుకోవాల్సింది. ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ తన చరిత్ర, లక్ష్యాల నుంచి పై తీర్మానాలు చేసినా కొంత మెరుగ్గా ఉండేది. ఇంతా చేసి, ఈ తీర్మానం లోని అంశాల గురించి కనీసం మీడియాల్లో, సమాజంలో చర్చ కూడా జరగలేదు.

**వైరుధ్యాలు - కొరవడిన చర్చ**

అదొక కోణమైతే, ఇంకో కోణంలో భారత్ సమ్మిట్ తీర్మానంలోని అంశాల్లోనే వైరుధ్యాలున్నాయి. ఒకపక్క కార్మిక హక్కులు వారి మెరుగైన జీవితం కోసం కృషి చేయాలంటూనే - మరోపక్క పనిచేసేవారిలో 85శాతం వరకూ ఉన్న అలాంటి అసంఘటిత కార్మికులు సంఘటిత రంగంలోకి రావటానికి పెద్ద అవరోధంగా ఉన్న పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) 3శాతం ప్రభుత్వోద్యోగుల ఓట్ల కోసం తాకట్టుపెడుతూ ఎన్నికల హామీనిచ్చింది కాంగ్రెస్ పార్టీయే. అదేరకంగా, మితిమీరిన సంక్షేమ పథకాలతో సంపన్న, బలమైన ఆర్థిక వ్యవస్థ గల తెలంగాణ, కర్ణాటక లాంటి రాష్ట్రాలు సంక్షోభంలో కూరుకుపోవటానికి కారణం కాంగ్రెస్ నాయకత్వమే. ఆ తర్వాత సంపద పన్ను, సంపద పంచటం. వీటన్నిటిలోని వైరుధ్యాలు, దుష్పరిణామాలు, అప్రజాస్వామిక దృక్పథాలపై సమావేశంలో, సమాజంలో, మీడియాలో లోతైన చర్చ జరగాల్సింది. ఇందు కోసం తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోనే అత్యంత ఖరీదైన హోటల్‌లో ఎంతఖర్చు చేసిందో కచ్చితంగా తెలీదుగానీ - జలగం వెంగళరావు, ఎన్.టి రామారావు లాంటి ముఖ్యమంత్రు లైతే, ఖర్చుకి-ఫలితానికి అంతరాన్ని చూసి గుండెలు బాదుకునే వారు.

**మిస్ వరల్డ్ 72వ పోటీలు**

ఇక ఇంతకంటే ఘనంగా నిర్వహించిన మరో ఈవెంట్ మిస్ వరల్డ్ 72వ పోటీలు. మే 10వ తేదీ నుంచి నెలాఖరు దాకా వివిధ రకాలుగా అభ్యర్థుల్ని పరీక్షించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం తొలుత అనేక ప్రయోజనాల్ని చూపించినా, చివరకు పర్యాటకానికి ఫిక్స్ అయింది. దాదాపు 108

దేశాలకు చెందిన యువతులు ఈవెంట్ లో పోటీపడ్డారు.

**ప్రభుత్వమే నిర్వహించటం సముచితమా?**

మన దేశంలో మొట్టమొదటి మిస్‌వరల్డ్ పోటీల్ని 1990లో బెంగళూరులో నిర్వహించారు. అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే సంస్థ ఆధ్వర్యంలో ఇది జరిగింది. ఒక ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం నిర్వహించటం బహుశా ప్రపంచంలో కూడా అరుదే. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు వ్యాపార దృక్పథంతో వీటిని నిర్వహిస్తాయి. ఈ పోటీలకు తెలంగాణ ప్రభుత్వం రూపాయి వెచ్చించలేదని, పెట్టిన వాటా ఖర్చు కూడా స్పాన్సర్ల రూపంలో తిరిగొచ్చిందని మంత్రి చెబుతున్నారు. కానీ ఇలాంటి ఈవెంట్ ద్వారా వచ్చే ప్రచారం కంటే ప్రభుత్వం తన మౌలిక బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చటం వల్ల పర్యాటకానికి ఎక్కువ ప్రయోజనం చేకూరే పరిస్థితి ఉన్నప్పుడు –ఆ పోటీల కోసం ముఖ్యమంత్రి దగ్గర్నుంచి సాధారణ అధికారి వరకూ ప్రభుత్వ యంత్రాంగం వెచ్చించిన సమయం కూడా భారీ ఖర్చుగానే లెక్కించాలి.

మహిళలకి తమ శరీరాల మీద తమకు పూర్తి హక్కు ఉంటుందనటంలో సందేహం లేదు. ఎలాంటి దుస్తులు ధరించాలి, ఎంత స్టయిల్‌గా వ్యవహరించాలి అనేవి వాళ్లిష్టం. అందాల పోటీలంటూ ఆకర్షణీయమైన అమ్మాయిల మధ్య పోటీ పెట్టటం నేరమేమీ కాదు. కానీ ఒక ప్రభుత్వం, అలాంటి కార్యక్రమం నిర్వహించటం అనేది సరైన ధోరణిగా అనిపించదు. ప్రభుత్వం తాను చేయాల్సిన పనుల్లో చాలామేర విఫలమవుతూ, అందాల పోటీల ద్వారా పర్యాటక రంగాన్ని పెంచగల మనుకోవటం అంత వాస్తవిక ధోరణి కాదు.ప్రభుత్వం బాధ్యతల్ని సక్రమంగా నిర్వహిస్తే విదేశీ పర్యాటకులు బ్రహ్మాండంగా వస్తారు.

మిస్ వరల్డ్ పోటీల ద్వారా తెలంగాణ రైజింగ్, తెలంగాణ జరూర్ ఆనా – అనే రెండు నినాదాల్ని ప్రాచుర్యంలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. వీటి ద్వారా ఆకర్షించాలనుకుంటున్నది విదేశీ పర్యాటకుల్ని. సద్వేశీ పర్యాటకులను ఆకర్షించటానికైతే మన వద్దే చాలామంది సినీ కళాకారులు, క్రీడాకారులు ఉన్నారు. వారిలో అనేకమంది ఉచితంగా కూడా బ్రాండింగ్ వర్క్ చేసి పెట్టొచ్చు. విదేశీ పర్యాటకులు రావాలంటే ఏం చేయాలి? పర్యాటక స్థలాలను ఆకర్షణీయంగా కాన్సెప్ట్‌లు, సౌకర్యాలతో తీర్చిదిద్దటం, భద్రత, పరిశుభ్రత, సరైన మౌలిక సదుపాయాలు, రవాణా వ్యవస్థ, ఆతిథ్య సంస్కృతి ముఖ్యం.

ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని రోజులకే లండన్ పర్యటనకు వెళ్లి అక్కడి థేమ్స్ నదిలా మన హైదరాబాద్‌లో మూసీనదిని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. అక్కడ్నుంచి వచ్చాక దాదాపు 1లక్షా 50వేల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ చేపట్టబోతున్నట్లు అనధికార లీకేజీలు ఇచ్చారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే సంక్షోభంలో చిక్కుకుని ఉంది. అలాంటప్పుడు లక్షన్నరకోట్లతో మూసీ ప్రక్షాళన అంటే, ఇక మిగతా కీలకరంగాల్లో, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ప్రభుత్వం పెట్టుబడి వ్యయం చేయటానికి ఒక్క రూపాయి అప్పుకూడా దొరకదు. మూసీ సుందరీకరణ వల్ల హైదరాబాద్ ఆకర్షణ మరింత పెరిగి పర్యాటకులు పెరుగుతారనటంలో సందేహం లేదు. కానీ భారీ వ్యయాలతో ఆచరణ సాధ్యంకాని రీతిలో ప్రాజెక్టుల్ని ప్రకటించటం పరిపాలన అవుతుందా? అది పర్యాటక రంగాన్ని పెంచుతుందా?

**సుప్రసిద్ధ ఆంగ్లకవి..జాన్ కీట్స్ నిర్వచనం ప్రకారం.. 'అందమైన వస్తువు ఎప్పటికీ ఆనందదాయకమే'. అందం అంటే అపార్థం చేసుకుంటారేమోనని, రెండేళ్ల తర్వాత రాసిన మరో కవితలో 'అందం అంటే నిజం! నిజమైనది మాత్రమే అందమైనది' అని స్పష్టమైన నిర్వచనం ఇచ్చారు. దీన్నే మన ప్రాచీన భారతీయ తత్వశాస్త్రంలో సత్యం, శివం, సుందరంగా చెబుతారు.**

మన దేశానికి వచ్చే విదేశీ పర్యాటకులతో పోలిస్తే, మనదేశం నుంచి ఇతర దేశాలకు పర్యాటకానికి వెళ్లేవారి సంఖ్య ఎక్కువే అయినా, ఈ సమస్య అన్ని రాష్ట్రాల్లో ఉన్నా – మిగతా చాలా చోట్ల స్వదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒక్క తెలంగాణలోనే స్వదేశీ పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుతోంది. అయితే, ఇదే సందర్భంలో మెడికల్ టూరిజం అభివృద్ధి చెందుతోంది. నాణ్యతా ప్రమాణాలు, మౌలిక వసతులు, మిగతా దేశాలలో పోలిస్తే చాలా తక్కువ ధరకు ప్రపంచ స్థాయి వైద్య చికిత్సల్ని అందించటం, భాష వంటి సమస్యలు లేకుండా అనుసంధానానికి ఎయిర్ పోర్టుల దగ్గర్నుంచి ఏర్పాట్లు వంటి ఆచరణాత్మక కారణాల వల్ల. వాళ్లు పెద్ద ప్రచార ఆర్భాటం కూడా లేకుండా విదేశీ రోగులను వైద్య సేవల కోసం ఆకర్షిస్తున్నారు. అన్నిటికంటే ముందు పర్యాటకులు స్వచ్ఛందంగా, ఆహ్లాదకరంగా పర్యటించగలిగేలా పరిపాలనను చక్కదిద్దుకోవటం అవసరం.

మార్కెటింగ్ కంటే ముందు ఇల్లు చక్కదిద్దుకోవటం అవసరం. పారిశుద్ధ్యం, చట్టబద్ధపాలన, మౌలిక వసతుల్లో నాణ్యత, వాయు కాలుష్యం వంటివి లేకుండా అన్ని ప్రాంతాలకూ కనెక్టివిటీలతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థ, రోజువారీ పాలన సక్రమంగా సాగేందుకు కనీసం హైదరాబాద్, ఇతర నగరాల్లోనైనా స్థానిక ప్రభుత్వాల్ని జవాబుదారీతనంతో బలోపేతం చేయటం వంటి చర్యలు అవసరం.

సుపరిపాలనకు, గ్రామాల, మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి వంటి విధానాల ద్వారా వ్యవసాయ పర్యాటకం సహా ఇతర ఆర్థికావకాశాల్ని చిట్టచివరి పౌరుని వరకూ అందుబాటులోకి తెచ్చి ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచటం మీద ప్రభుత్వం సమర్థంగా వెచ్చించాలి. ప్రచారం మాటున వైఫల్యాల్ని కప్పిపుచ్చుకోకుండా నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చిన్న పట్టణాల అభివృద్ధితో అందరికీ ఉపాధి ఆర్థిక క్రమశిక్షణ మొదలైన సంస్కరణల కోసం తెలంగాణ ప్రభుత్వం ఫెడరలిజం అవకాశాన్ని సద్వినియోగం గావించుకోవటం అవసరం. మిస్ వరల్డ్, భారత్ సమ్మిట్ వల్ల ఏమైనా గణనీయ ప్రయోజనం వచ్చిందీ అంటే విభజన రాజకీయాలతో అన్ని రంగాలలో అనిశ్చితి, అభద్రతకు గురవుతున్న ప్రపంచంలో 100కి పైగా దేశాలు ఒకచోటికి కలిసిరావటం. మిస్ వరల్డ్ విజేత సుచాత చెప్పినట్లు, బాధ్యతల నిర్వహణలో మాటల కంటే చేతలు ముఖ్యం.

★

# తెలంగాణ : మూడు నెలల్లోనే రూ.20,000 కోట్ల రుణం

2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.54,009 కోట్ల కొత్త రుణాలను మార్కెట్ నుంచి సేకరించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు 'కాగ్' ఇటీవల వెల్లడించింది. వీటిలో ఏప్రిల్ లో రూ.5,230.99 కోట్లు, మే నెలలో రూ.4,500 కోట్లు సేకరించింది. కీలకమైన రైతు భరోసా, యువ వికాసం పథకాలకు జూన్ లో రూ.8,500 కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్ నుంచి సేకరించింది. ఇందుకోసం రూ.1500 కోట్లు, 3,500 కోట్లు, 4,000 కోట్ల బాండ్ లను వేలానికి పెట్టింది. వీటిలో రూ.9,000 కోట్లు రైతుభరోసా పథకానికే వెచ్చించారు.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభమైనందున తొలి త్రైమాసికంలో అత్యధిక నిధులను రైతులకు పెట్టుబడి సాయం కోసం కేటాయించారు. ఆ తర్వాత రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఆమోదం తర్వాత రూ.6,000 కోట్లు.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు అమల్లోకి వచ్చినందున జులై నుంచి జీతాలు పెంచటానికి రూ.300 కోట్లు సేకరించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు నెలకు రూ.700 కోట్ల చొప్పున దశలవారీ విడుదల చేయనున్నారు. మొత్తంగా డీఏ బిల్లులకు అదనంగా రూ.1000 కోట్లు కేటాయించారు,

ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలం వరకూ రూ.18,230 కోట్లు సమీకరించగా, పలు పథకాలకు తొలి త్రైమాసికం కేటాయింపులు ఇంకా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో, జులై తొలివారం నాటికి రుణ సమీకరణ రూ.20,000 కోట్లు దాకా ఉంటుందని అంచనా.

దీంతో.. జీఎస్టీ, వ్యాట్ వసూళ్ల ద్వారా ఆదాయం పెంచాలని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు ప్రభుత్వం సూచించింది. వీటి వసూళ్లలో అక్రమాలను అరికడితే ఆదాయం ఇంకా పెరుగుతుందని తెలిపింది. రిజిస్ట్రేషన్లు కూడా క్రమంగా పెరుగుతున్నందున వాటిపైనా ఆదాయం అదనంగా వస్తుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది.

---

## ఆంధ్రప్రదేశ్ : రెండు నెలల్లో 50 శాతం దాటిన రాష్ట్ర రెవెన్యూ లోటు

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొలి రెండు నెలల్లో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూలోటు రూ.17,686 కోట్లుగా 'కాగ్' వెల్లడించింది. ఈ వ్యవధిలో రాష్ట్రంలో రెవెన్యూ రాబడి రూ.21,707.31 కోట్లు ఉండగా, రెవెన్యూ ఖర్చులు 39,393.59 కోట్ల మేరకు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రెవెన్యూ లోటును రూ.33,185.97 కోట్లకు పరిమితం చేస్తామని ఆర్థికమంత్రి భరోసా ఇచ్చారు. కానీ, రెండు నెలల్లోనే అది 53 శాతానికి చేరింది. మరోవైపు 22,884 కోట్లు రుణాలు సమీకరించినట్లు కాగ్ నివేదిక పేర్కొంది.**

**కాగ్ వెల్లడించిన ఏపీ లెక్కలు**

| అంశం | అంచనాలు (12 నెలలకు) | మే నెలాఖరుకు వచ్చిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| రెవెన్యూ రాబడి | 2,17,976.53 | 21,707.31 |
| పన్నుల రాబడి | 1,66,573.09 | 20,381.18 |
| జీఎస్టీ | 27,477.15 | 7,751.42 |
| స్టాంపులు, రిజిస్ట్రేషన్లు | 13,150.44 | 1820.19 |
| భూమిశిస్తు | 221.34 | 0.24 |
| అమ్మకపు పన్ను | 20,873.65 | 2,839.13 |
| రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ | 27,097.26 | 2,824.70 |
| కేంద్ర పన్నుల్లో వాటాలు | 40,807.28 | 4,221.50 |
| ఇతర పన్నులు | 36,945.37 | 924.00 |
| పన్నేతర రాబడి | 19,119.04 | 814.33 |
| కేంద్ర గ్రాంట్లు | 32,284.40 | 511.80 |
| అప్పులు | 79,952.63 | 22,844.34 |
| రెవెన్యూ వ్యయం | 2,51,162.50 | 39,393.59 |
| మూలధన వ్యయం | 40,635.72 | 2,242.18 |

# ఆంధ్రప్రదేశ్ లో డీడీఓ వ్యవస్థ బలోపేతం

గ్రామీణ స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల పర్యవేక్షణ ఏపీలో ఇకపై డివిజనల్ అభివృద్ధి అధికారులు (డీడీఓ) చేపట్టనున్నారు. ఎన్నికల్లో జిల్లా ఉప ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం 1994లో త్వరలో సవరణలు చేయనున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణను ఇప్పటివరకు ఆర్డీఓలు చూస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యక్రమాలపై ప్రభుత్వం పలు అధికారాలు, బాధ్యతలు, విధుల్ని డీడీఓలకు కల్పించింది. రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో వీరికి కార్యాలయాలు కేటాయించింది. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖలపై ఆర్డీఓలకు అధికారులు ఉన్నట్లుగా %-% పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై డీడీఓలకు అధికారాలుంటాయి. ఎంపీడీఓల్లో పలువురికి గత ప్రభుత్వం డీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. 77 రెవెన్యూ డివిజన్లలో పని చేస్తున్నారుగానీ వీరికి ఎటువంటి విధులు, బాధ్యతలు అప్పగించలేదు. దీంతో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. ప్రస్తుత ప్రభుత్వం డీడీఓ వ్యవస్థను బలోపేతం చేసేలా నిర్ణయాలు తీసుకుంది.

**కేటాయించిన అధికారాలు, బాధ్యతలు**

❖ డివిజనల్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలకు డీడీఓ అధిపతిగా ఉంటారు.
❖ అభివృద్ధి కార్యక్రమాలపై సమన్వయం, పర్యవేక్షణ, సమీక్ష
❖ కలెక్టర్ నియంత్రణలో బాధ్యతల నిర్వహణ
❖ నెలలో 20 రోజుల క్షేత్రస్థాయి పర్యటనలు
❖ ఎంపీడీఓల పనితీరుపై సమీక్ష, వార్షిక రహస్య నివేదికల తయారీ
❖ పంచాయతీల్లో ఆడిట్ అభ్యంతరాలు, గ్రామీణాభివృద్ధి ప్రణాళికల అమలుపై సమీక్ష
❖ పన్నులు, రుసుముల వసూళ్లు పెరిగేలా చర్యలు
❖ నెలలో కనీసం మూడు పంచాయతీల్లో తనిఖీలు
❖ ఉపాధి హామీ పథకం అమలు, సామాజిక తనిఖీలు, హాజరుపై తనిఖీలు
❖ గ్రామ సచివాలయాల్లో సంక్షేమ పథకాలు అమలు, ఉద్యోగుల పనితీరుపై సమీక్ష
❖ గ్రామీణ తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర శాఖల మధ్య సమన్వయం

# పామాయిల్ పై తగ్గించిన దిగుమతి సుంకాలు పెంచండి

ముడి పామాయిల్ దిగుమతులపై తగ్గించిన 10శాతం సుంకాన్ని వెంటనే పెంచి దేశీయ రైతులను ఆదుకోవాలని హోంమంత్రి అమిత్ షా ను యూనియన్ మంత్రి రామ్మోహన్ నాయుడు, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాసిన లేఖను వారు అందచేశారు. దిగుమతి సుంకాల్ని తగ్గించటం వల్ల మన దేశంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దేశంలోని పామాయిల్ సాగులో 50శాతం ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతోంది. 1.74లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో పామాయిల్ సాగు చేస్తున్నారు. యూనియన్ ఆహారశుద్ధి మంత్రికి కూడా వారు చంద్రబాబు లేఖను అందచేశారు. తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఈ మేరకు యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాం నుంచి పామాయిల్ సాగుకు గణనీయ ప్రాధాన్యతనిస్తున్నారు.

కాగా, ముడి పామాయిల్, ఇతర పంట నూనెలపై దిగుమతి సుంకం విధించాలని ఆరేడేళ్లు పోరాడి సాధించిన లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్) వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కూడా ముడి పామాయిల్ దిగుమతి సుంకం ఇంకా తగ్గించటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ దిగుమతి సుంకాన్ని 30-40 శాతానికి పెంచటంతో పాటు, ఆ ఆదాయాన్ని మన రైతులకే ఇచ్చి వంట నూనెల్లో స్వయంసమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలని జేపీ డిమాండ్ చేశారు.

# గురువులా? లఘువులా?

భారత విద్యారంగ దుస్థితి గురించి, విద్య అసలు లక్ష్యమైన విద్యా ప్రమాణాల అధ్వాన్న స్థాయి గురించి 2005 నుంచి 'అసర్', మరికొన్ని సర్వేలు వెల్లడిస్తున్నా ప్రభుత్వాలు దాదాపు 2016 సంవత్సరం దాకా అదంతా బూటకమన్నట్లు బుకాయిస్తూవచ్చాయి. ఆ తర్వాత సొంత సర్వేల్లోనూ అదే భయంకర వాస్తవం వరుసగా బయటపడుతుండటంతో కొద్దిపాటి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాయి. అయితే విద్యకు సమాజంలో, కులం, మతం, భాష, ప్రాంతం, వర్గాలకు అతీతంగా ఉన్న డిమాండ్ తీవ్రతతో, మన దేశం ఇప్పుడున్న ఆర్థికాభివృద్ధి పరిస్థితులకు అవసరమైన వేగంతో పోలిస్తే .. ప్రభుత్వాల దిద్దుబాటు చర్యలు నత్తనడకనే సాగుతున్నాయని చెప్పాలి. ఇలాంటి నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పలు వేదికల మీద సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వ విద్యారంగ ఘోర వైఫల్యాన్ని పతాక శీర్షికల్లోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.



రాష్ట్రస్థాయి పెద్దల సభగా చెప్పుకునే శాసనమండలిలో ఉపాధ్యాయులు మాత్రమే ఎన్నుకునే ప్రతినిధులు కూడా ఉంటారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నాటి ఆనవాయితీని కొనసాగించటం తప్ప ప్రత్యేకించి ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు ఓటువేసి ఎమ్మెల్సీలను ఎన్నుకోవటంలో ఎటువంటి ఔచిత్యమూ కనిపించదు. అదలా ఉంచితే, విద్యారంగ సంక్షోభంపై మండలిలో మాట్లాడే క్రమంలో ఉపాధ్యాయ ప్రతినిధులను తాకేలా కొన్ని అంశాల్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.

“కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 10 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం. 31 వేలమంది టీచర్ల బదిలీలను పారదర్శకంగా చేపట్టాం. విద్యారంగంలో ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో ఎక్కువ టీచర్ల జీతభత్యాలకే పోతోంది. శిక్షణ కూడా ప్రయివేటు స్కూళ్లలో కంటే సర్కారీ బడుల ఉపాధ్యాయులకే ఎక్కువగా ఉంటుంది. అయినా ఎక్కువ శాతం మంది పిల్లలకి చదువు రావటంలేదు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ కలిపి 26,106 ఉండగా, వాటిలో చదువుతున్న పిల్లలు 16,86,347 మంది. బడ్జెట్ ప్రకారం లెక్కేస్తే, ఒక్క విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి రూ.1,08,000 ఖర్చు చేస్తోంది. కానీ దేశం లోని మొత్తం 37 ర్యాంకుల్లో తెలంగాణ ఏ స్థానంలో ఉందో గమనిస్తే .. మూడో తరగతి తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో 36, గణితంలో 35, ఈవీఎస్‌లో 36వ స్థానంలో ఉంది. అయిదో తరగతిలో చూస్తే, తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో 36, గణితంలో 35, ఈవీఎస్ లో 36వ స్థానంలో ఉంది. దీంతో, ఉన్నకొద్దీ ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతూ, ప్రయివేటులో పెరుగుతున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ మనసులోని మాట సుస్పష్టం. తాము అంతంత జీతభత్యాలు ఎందుకు తీసుకుంటున్నామో, ఆ బాధ్యతను నెరవేర్చటంలో ప్రభుత్వ స్కూళ్ల ఉపాధ్యాయుల్లో చాలా మంది విఫలమవుతున్నారన్న అభిప్రాయాన్ని పరోక్షంగానైనా, ఘాటుగానే ఆయన వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్య ఎక్కువమందికి అందకపోవటానికి ఇంకొన్ని కారణాలుండొచ్చుగానీ, ఎక్కువమంది ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, అలసత్వం, నిర్లక్ష్యం ఓ పెద్ద కారణమన టంలో సందేహం లేదు. విషయ పరిజ్ఞానం, బోధనా పద్ధతులు, సాంకేతిక సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవటం అలా ఉంచితే... విద్యార్థులు వినమ్రత, గౌరవభావాలతో శ్రద్ధగా నేర్చుకోవటానికి అవసరమైన కనీస వ్యక్తిగత నైతిక ప్రమాణాల్ని కూడా పలువురు టీచర్లు పాటించటం లేదని ఇటీవల తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రస్ఫుటంగా తెలియచేస్తున్నాయి.

ఏ పెద్దల సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యావ్యవస్థ దుస్థితి గురించి వాపోయారో, ఆ పెద్దల సభలో కూర్చునే వారు, ఆ పెద్దల్ని ఎన్నుకునే పెద్దలు, దేవుడ్ని నమ్మేవారికి తల్లిదండ్రుల తర్వాత, ప్రత్యక్ష దైవమైన ఉపాధ్యాయుల్లో పలువురు ఎమ్మెల్సీ ఎన్నికల్లో దిగజారి వ్యవహరించారు. ఎంతో విలువైన ఓటుకి అడిగి మరీ డబ్బులు పుచ్చుకున్నారు. చదువుకున్నవాళ్లకంటే సామాన్యులు నయమనే రీతిలో బేరమాడిమరీ డబ్బులు వసూలు చేశారు.

మీడియాలో వచ్చిన విశ్వసనీయ కథనాల ప్రకారం, పార్టీలతో సంబంధం లేకుండా గతంలో ఎన్నడూలేని స్థాయిలో తెలంగాణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాసులు వెదజల్లారు. కొందరు అభ్యర్థులు పోటాపోటీగా పంపకాలు చేశారు.

ఎన్నికల ప్రచారం ముగిసేనాటికే చిన్నచిన్న ఉపాధ్యాయ సంఘాల మద్దతు కోసం అభ్యర్థులు రూ.లక్షలు ముట్టచెప్పారు. ప్రచారం ముగిసిన వెంటనే, వ్యక్తిగతంగా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో లక్షలమంది ఓటర్లు ఉండటంతో డబ్బు పంపకంలో కొన్నిచోట్లయినా కొంత పరిమితి కనిపించేది. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 25 వేలమంది ఓటర్లే కావటం, ఈసారి ఆర్థికంగా బలమైన అభ్యర్థులు బరిలో ఉండటం, గెలుపుని పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావించటంతో, ఓటుకు రూ.2,000 నుంచి 5,000 వరకు పంపిణీ చేశారు. పోలింగ్ నాటికి సగంమందికి పైగా పంచినట్లు అంచనా. డబ్బు ప్రభావంతో, మొదటి ప్రాధాన్య ఓటు లేదా కనీసం రెండో ప్రాధాన్య ఓటు దక్కుతుందని అభ్యర్థులు ఆశించారు. ముఖ్యంగా పార్టీలవారీగా చీలిక ఉన్నచోట రెండో ప్రాధాన్య ఓటు కీలకంగా మారుతుందని ఆశపడ్డారు. ఈ నేపథ్యంలో, కేజీబీవీ, గురుకులాలపై దృష్టి పెట్టారు. ఉపాధ్యాయ సంఘాలకు కట్టుబడని వర్గాలున్నచోట డబ్బు పంపిణీ ఎక్కువగా జరిగింది.

❖ కరీంనగర్ – మెదక్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో, ఒక కీలక అభ్యర్థి ఒక్కో ఓటుకు రూ.5 వేల చొప్పున ఇవ్వగా, మరొకరు రూ.3 వేల చొప్పున చెల్లించినట్లు సమాచారం. ఈ లెక్కన ఒకరు రూ.10 కోట్లు, మరొకరు రూ.7.50 కోట్లు పంచినట్లు. కరీంనగర్‌లో అనేకమంది ఉపాధ్యాయ ఓటర్లు నోట్ల కోసం అభ్యర్థుల కార్యాలయాలకు క్యూ కట్టారు.

❖ నల్గొండ – వరంగల్ – ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థులు గరిష్టంగా రూ.2 వేలు పంచినట్లు మీడియా ధృవీకరించింది.

❖ ఓ అభ్యర్థి తరపున కొందరు ఫోన్ పే, గూగుల్ పే చేశారు.

**నిఖార్సయిన గురువులూ ఉన్నారు**

కొందరు ఉపాధ్యాయులు తమకు డబ్బు ఇచ్చినా వద్దని తిప్పిపంపినట్లు చెబుతున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తూ, తల్లిదండ్రుల్లో, సమాజంలో ఉన్న డిమాండ్‌ను ఉపయోగించుకుంటూ ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వంటి సంస్థల సహకారంతో ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తే ఖచ్చితంగా ఇప్పుడున్న బడ్జెట్‌తోనే అతి తక్కువ కాలంలో విద్యారంగంలో గణనీయ మార్పులు తీసుకురావచ్చు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ కూడా జరగాలి. ★

## జిందాల్ నూతన పరిశ్రమలను స్వాగతించండి

విజయనగరం జిల్లా ఎస్.కోట మండల పరిధిలోని కిల్తంపాలెం, చీడిపాలెం, పెద ఖండేపల్లి, ముసిడిపల్లి ప్రాంతాల్లోని భూమిని 2008 లో సేకరించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అల్యూమినా కర్మాగారం ఏర్పాటు కోసం 1048 ఎకరాల 65 సెంట్ల భూసేకరణ చేసి జిందాల్ యాజమాన్యానికి ఇచ్చారని, అయితే అప్పటినుంచి ఇప్పటి వరకు గత 17 సంవత్సరాలుగా ఫ్యాక్టరీ రాలేదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వ చొరవతో జిందాల్ యజమానులు కొత్తగా చిన్న, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి ముందుకొచ్చారన్నారు. నూతన పరిశ్రమలను రైతులు అడ్డుకోకుండా జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి, యువత ఉపాధికి దోహదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అడ్డతీగ గ్రామంలో భూనిర్వాసితులతో కలిసి ఆయన మాట్లాడారు.

**జిందాల్ భూనిర్వాసితులకీ న్యాయం చేయాలి**

జిందాల్ భూనిర్వాసితులకు తప్పక న్యాయం జరగాలని, కర్మాగారం యజమానులు రైతులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలన్నారు. ఇందుకోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. రైతులకు న్యాయం కోసం లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ఏసీబీ, లోకాయుక్త దాకా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. 3,970 కోట్లతో 45 వేల మందికి ఉపాధినిచ్చే పరిశ్రమలను అడ్డుకోకుండా రైతులు శాంతియుత చర్చలకు సిద్ధమవ్వాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు లేక.. ఉన్న పరిశ్రమలు నాయకుల పుణ్యమా అని మూతపడటంతో యువత ఉపాధి కోసం వలసలు పోతున్నారన్నారు. తయారీ రంగం పెరిగి వ్యవసాయం నుంచి పారిశ్రామిక ఉపాధి వైపు యువత మళ్లటం ఈవేళ దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలకూ కీలకమన్నారు. ఇందుకోసం గ్రామాల మధ్య పరిశ్రమలతో చిన్న పట్టణాల అభివృద్ధికి లోక్ సత్తా కృషి చేస్తోందని బాబ్జీ తెలిపారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్, పౌర వేదిక అధ్యక్షుడు పిడకల ప్రభాకర రావు, జిందాల్ బాధితులు మోహన్, అప్పారావు, మాజీ ఎంపీటీసీ అరుణ, సత్యనారాయణ, రాజు, ఒలం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం తక్కువైనా సగం తెలంగాణ వ్యవసాయంలోనే !

మూడు గణాంకాలు మన దేశానికే ప్రత్యేకమైన ప్రమాద సంకేతాలని, వాటి నుంచి బయటపడి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎలా ఎదుగుతుందోనని ప్రపంచమంతా విప్పారిన కళ్లతో చూస్తోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెబుతుంటారు. వాటిల్లో దేశ స్థూల ఉత్పత్తి ఆదాయంలో కేవలం 16 శాతం వాటా కలిగిన వ్యవసాయం మీద జనాభాలో 46%కి పైగా ఆధారపడి ఉండటం. అభివృద్ధికి పర్యాయపదమైన పట్టణీకరణ కాస్త వేగంగా జరుగుతున్న తెలంగాణాలో కూడా పరిస్థితి ఇదే రకంగా ఉందని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి.

'వ్యవసాయ రంగమే తెలంగాణ ప్రజలకు జీవనాడిగా ఉంది. రాష్ట్ర ప్రజల్లో అత్యధిక శాతం మంది సేద్యంలోనే ఉపాధి పొందుతున్నారు. వీరి సంఖ్య కోటిన్నర దాకా ఉంటుంది' అని 'రాష్ట్ర గణాంకాల నివేదిక-2024' తెలిపింది. 2023-24లో రూ.40.44 లక్షల కోట్ల స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)తో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలువగా ... రూ.15.01 లక్షల కోట్లతో తెలంగాణ 7వ స్థానంలో నిలిచింది.

**అర్థగణాంక శాఖ రూపొందించిన నివేదికను రాష్ట్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ముఖ్యాంశాలు:**

✦ తెలంగాణ జీఎస్‌డీపీలో రియల్ ఎస్టేట్, ఐటీ, వృత్తి సేవల రంగం వాటా 24.4% ఉండగా ... వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, గనులు కలిపి 17.6%, వాణిజ్య, హోటళ్ల రంగం వాటా 19.9%, ఉత్పత్తి రంగం 8.9%, నిర్మాణ రంగం 5.2%, రవాణా, సమాచార రంగం 7%, ఆర్థిక సేవలు 4.8%, ఇతర రంగాలు మిగిలిన వాటాను కలిగి ఉన్నాయి.

✦ జీఎస్‌డీపీలో రియల్ ఎస్టేట్, ఐటీ, వృత్తి సేవల రంగం మొదటి ర్యాంకులో ఉన్నా, 51% మందికి ఉపాధి కల్పిస్తూ వ్యవసాయం కీలక రంగంగా అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, వృత్తి సేవల రంగంలో 4% మంది, ఉత్పత్తిలో 12%, వాణిజ్య, హోటళ్ల రంగంలో 10% మంది, మిగిలినవారు ఇతర రంగాల్లో ఉపాధి పొందుతున్నారు.

✦ 2023-24లో రాష్ట్ర ప్రజల తలసరి వార్షిక ఆదాయం



(పీసీఐ)లో రూ.5.87 లక్షలతో సిక్కిం, రూ.4.61 లక్షలతో ఢిల్లీ, రూ.3.56 లక్షలతో తెలంగాణ వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. జాతీయ స్థాయిలో పీసీఐ రూ.1.84 లక్షలుగా ఉంది.

✦ 2018-23 మధ్య వరుసగా ఐదేళ్లలో తలసరి ఆదాయంలో నమోదైన 'సగటు వార్షిక వృద్ధిరేటు' జాతీయ స్థాయిలో 12.04 శాతం ఉండగా... తెలంగాణ 12.03 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఒడిశా (11.02%), కర్ణాటక (10.59%), మధ్యప్రదేశ్ (10.13%)తో వరుసగా 2,3,4 స్థానాల్లో ఉన్నాయి. ఈ 3 రాష్ట్రాలు తప్ప... మరే ఇతర రాష్ట్రంలోనూ రెండంకెల వృద్ధి రేటు నమోదు కాలేదు. ఈ అయిదేళ్ల కాలవ్యవధిలో తెలంగాణలో 2022-23లో అత్యధికంగా 16.18% వృద్ధిరేటు నమోదైంది.

**జిల్లాల్లో రంగారెడ్డి ప్రథమం... వికారాబాద్ చిట్టచివర**

✦ జిల్లాలవారీగా తలసరి ఆదాయంలో రంగారెడ్డి రూ.9.54 లక్షలు, హైదరాబాద్ రూ.4.97 లక్షలు, సంగారెడ్డి రూ.3.21 లక్షలతో తొలి మూడు స్థానాల్లో ఉండగా... రూ. 1.83 లక్షలతో వికారాబాద్ చిట్టచివరన అంటే 33వ స్థానంలో నిలిచింది.

✦ స్థూల జిల్లా జాతీయోత్పత్తి (జీడీడీపీ)లో 2022-23లో రంగారెడ్డి రూ.2.85 లక్షల కోట్లతో, హైదరాబాద్ రూ.2.30 లక్షల కోట్లతో తొలి స్థానాల్లో ఉండగా, రూ.7,583 కోట్లతో ములుగు జిల్లా 33వ స్థానంలో నిలిచింది.

**అక్షరాస్యత 66.5%**

✦ 2011 జనగణన ప్రకారం రాష్ట్ర జనాభా 3.50 కోట్లు కాగా ... 2026 నాటికి 3.86 కోట్లు దాటుతుందని

అంచనా. ప్రతి వెయ్యిమంది బాలురకు 988 మంది బాలికలున్నారు. రాష్ట్ర అక్షరాస్యత శాతం 66.5. రాష్ట్రంలో మొత్తం 40,975 పాఠశాలలున్నాయి. 2023-24లో మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల సంఖ్య (డ్రాపౌట్లు) ఉన్నత పాఠశాల స్థాయిలో 11.95%.

✦ 2023-24లో రాష్ట్రంలో 207.93 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి.

✦ పరిశ్రమల రంగంలో జాతీయ పారిశ్రామిక స్థూల విలువలో తెలంగాణ 3.37% వాటా కలిగి ఉంది. దేశంలో ఉన్న మొత్తం పరిశ్రమల్లో 5.16 శాతంతో రాష్ట్రం 8వ స్థానంలో ఉంది.

✦ ఆర్‌టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాలకు 2024 మార్చి 31 నాటికి రూ.1,163.08 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. మహాలక్ష్మి పథకం కింద 39.57 లక్షల మందికి రాయితీపై గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. గత ఆగస్టు ఆఖరు నాటికి పేదల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు సరఫరాకు రూ.808.33 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.

ఇతర అంశాలు:

✦ హైదరాబాద్ జనసాంద్రత 18,161 కాగా, రాష్ట్ర సగటు జనసాంద్రత 312 మాత్రమే.

✦ జీహెచ్‌ఎంసీ పరిధిలో మొత్తం 9013 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో 2846 కిలోమీటర్లు బీటీ రోడ్లు, మిగిలినవి కాంక్రీటు రోడ్లు.

✦ రాష్ట్రంలో ఉన్న పాఠశాలల్లో అత్యధికంగా మొదటి మూడు స్థానాల్లో రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, మేడ్చల్ - మల్కాజ్‌గిరి ఉన్నాయి.

✦ ఎస్.సి, ఎస్.టిలు అత్యల్పంగా ఉన్న జిల్లాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది.

ముఖ్యమంత్రి ఆగ్రహం

ఈ గణాంకాల్లో కొన్ని పాతవి యథాతథంగా నమోదు చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తిని వ్యక్తం చేయడంతోపాటు కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నారు.

✷

## ఆరు నెలల్లో 126 అవినీతి కేసులు

లంచగొండి అధికారులపై అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) కొరడా ఝుళిపిస్తోంది. వరుస దాడులు, ఆకస్మిక తనిఖీలు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, వలపన్ని ట్రాప్ చేయడం సహా అన్ని మార్గాల్లోనూ అవినీతి అధికారులపై కేసులు నమోదు చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30 వరకే మొదటి ఆరు నెలల్లో మొత్తం 126 కేసులు నమోదు చేసినట్టు ఏసీబీ డీజీ కార్యాలయం వెల్లడించింది. ఇందులో 80 ట్రాప్ కేసులు, ఎనిమిది ఆదాయానికి మించి ఆస్తుల కేసులు, 14 క్రిమినల్ మిస్ కండక్ట్ కేసులు, పది రెగ్యులర్ ఎంక్వైరీలు, 11 సర్‌ప్రైజ్ చెక్‌లు, మూడు డిస్క్రీట్ ఎంక్వైరీస్ ఉన్నట్లు తెలిపింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులలో రూ. 27,66,60,526 విలువైన ఆస్తులు సీజ్ చేసినట్టు పేర్కొంది. అక్రమాలకు పాల్పడుతున్న వారిలో పట్టుబడుతున్న వారి సంఖ్య బహుస్వల్పమే. కొంతమంది అవినీతి అధికారుల వద్ద నుంచి స్వాధీనం చేసుకుంటున్న సొమ్ము చూసి అధికారులే నోరెళ్లబెడుతున్నారు. అనధికారికంగా వారి ఆస్తుల విలువ వేల కోట్లలో ఉంటోంది. ఇటీవల తెలంగాణలో పట్టుబడిన నీటిపారుదల శాఖ అధికారుల ఆస్తుల విలువ వందల కోట్లలో ఉండడం గమనార్హం.

## 27.2 కోట్ల మంది పిల్లలు బడి బయటే

మహిళా విద్యపై నిషేధం, పేదరికం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి కారణాలతో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 27.2 కోట్ల మంది పిల్లలు పాఠశాలల బయటే ఉండిపోవాల్సి వస్తోందని యునెస్కో తెలిపింది. ఈ సంస్థకు చెందిన అంతర్జాతీయ విద్యా పర్యవేక్షణ బృందం ఇటీవల ఓ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం ప్రాథమిక పాఠశాల వయసు పిల్లల్లో 11 శాతం(7.8 కోట్లు), మాధ్యమిక పాఠశాల, కౌమార వయసు చిన్నారుల్లో 15 శాతం(6.4 కోట్లు) మంది ఉన్నత వయసు విద్యార్థుల్లో 31 శాతం(13 కోట్లు) మంది విద్యకు దూరమవుతున్నారు. ఎస్‌డీజీ 4 స్కోరు కార్డు ప్రకారం.దేశాలు తమ లక్ష్యాలను చేరుకున్నట్లయితే 2030 నాటికి బడి బయట ఉన్న పిల్లల సంఖ్యను 16.5 కోట్లకు తగ్గించవచ్చు. అయితే ఒక్క 2025లోనే ప్రాథమిక, ఉన్నత స్థాయి పాఠశాల వయసు గల 7.5 కోట్ల మంది చిన్నారులు విద్యకు దూరం కానున్నారని నివేదిక అంచనా వేసింది. విద్యకు చిన్నారులు దూరం కావడం ద్వారా తలెత్తే పరిణామాలపై సరిగా అంచనాలు రూపొందించడం లేదని అభిప్రాయపడింది.

# కీలక సమయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం

ఈ ఏడాది జులై 5న ప్రపంచ సహకార దినోత్సవం జరుపుకుంటున్నాం. అంతేకాదు, 2025 అంతర్జాతీయ సహకార సంవత్సరం (ఐవైసీ) కూడా. 1895లో ఆవిర్భవించిన ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్స్ అలయెన్స్ (ఐసీఏ) ఆధ్వర్యంలో 1923 నుండి మనం ప్రపంచ సహకార దినోత్సవం జరుపుకుంటున్నా.. ఐక్యరాజ్యసమితి దశాబ్దానికోసారి అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని ప్రకటించటం మాత్రం 2012 నుంచే మొదలైంది. ఐవైసీని ప్రారంభించిన 2012 లోనే ఒక గొప్ప రాజ్యాంగ సవరణ FDR, లోక్‌సత్తా కృషి వల్ల సాకారమైంది. అది 97 వ రాజ్యాంగ సవరణ. తెలుగునాట ఎన్.టి రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, నేను మెంటర్‌గా భావించే వర్గీస్ కురియన్ స్ఫూర్తితో 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టాన్ని తెచ్చే అవకాశం లభించింది. ఆ తర్వాత యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి జాతీయ సలహా మండలి (NAC) సభ్యునిగా అవకాశాన్ని ఉపయోగించుకుని మ్యాక్స్ నమూనాలో 97వ రాజ్యాంగ సవరణ సాధించాను. ఈ రాజ్యాంగ సవరణ రూపకల్పనలో కొందరు సివిల్ సర్వెంట్లు అత్యుత్సాహంతో కొన్ని అనవసర పదజాలాన్ని జోడించారు. దానికి కోర్టులు కూడా అభ్యంతర పెట్టాయి. మనకి ఒక రాజ్యాంగ సవరణ సరిగా రాయటమే చేతకాదు, ఆ తర్వాత రాజకీయ ఏకాభిప్రాయం సాధించలేము.. బాగా ఫలితాలు సాధిస్తున్న రాజ్యాంగాన్ని తిరగ రాస్తామన్న డాంబికా లెందుకు?.. అని కొత్త రాజ్యాంగం వాదన చేసేవారిని ఇలాంటి నేపథ్యంలోనే నేను తరచూ ప్రశ్నిస్తుంటాను. అదలా ఉంచితే.. మొత్తంగా లోక్‌సత్తా కృషి వల్ల ప్రజలు రాజకీయ ప్రమేయం లేకుండా, తమలో తాము సొంతంగా సహకార సంఘాలుగా ఏర్పడే హక్కయితే 97వ రాజ్యాంగ సవరణ ద్వారా లభించింది. స్వతంత్ర భారత ఇది ఎంత విప్లవాత్మక సవరణో భవిష్యత్తు భారతం కచ్చితంగా గుర్తెరుగుతుంది. ఒక్క ఎంపీ కూడా లేకుండా లోక్‌సత్తా ఇంత కీలక రాజ్యాంగ సవరణని సాధించింది. అదే ఏడాది కొన్ని నెలల ముందు దివంగతులైన అమూల్ కురియన్‌కు నివాళిగా సమర్పించింది. ఆ సవరణకు ముందు, తర్వాత కూడా.. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యాన్ని నిలువరించడానికి లోక్ సత్తా అనేక పోరాటాలు చేసింది. ఇందుకు పలువురు పౌర సమాజ నేతలు, విజ్ఞులు కూడా పార్టీలకతీతంగా కలసివచ్చారు. యూనియన్‌లోని ప్రస్తుత NDA ప్రభుత్వమూ 97వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తితో సహకార సంఘాల బలోపేతం ప్రాధాన్యతను గుర్తించటం మంచి పరిణామం.

సంపద సృష్టించేది ప్రజలు తప్ప ప్రభుత్వాలు కాదు. వ్యక్తి సుఖానికి – సమాజ హితానికి అనుసంధానంతో సంపద సృష్టి జరిగినప్పుడే.. ప్రజాస్వామ్య, రాజ్యాంగ, పర్యావరణ పరిరక్షణ, సామరస్యత సాధ్యమవుతాయి. అదేవిధంగా, ఒక దేశాభివృద్ధికి – ప్రపంచ హితానికి మధ్య సంధానంతోనే అంతర్జాతీయ శాంతి, సమ్మిళిత, సుస్థిరాభివృద్ధి సాధ్యమ వుతాయి. అందుకు సహకార సంఘాలు, సంస్కృతి ఎంతో కీలకం. 'మెరుగైన ప్రపంచం కోసం సహకార సంఘాల సమ్మిళిత, సుస్థిర పరిష్కారాలు' ఇతివృత్తంతో ఈ ఏడాది ఐవైసీని జరుపుకుంటున్నాం. బలమైన, ఆర్థికంగా ఆరోగ్యకరమైన సహకార సంఘాలు, దృక్పథం ఈవేళ్టి పరిస్థితుల్లో భారతదేశానికి, ప్రపంచానికీ ఎంత కీలకమో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఉపాధి ఆధారిత సంపద సృష్టికి, శాంతి సామరస్యాలతో మానవాళి సుఖసంతోషాలకు దోహదం చేసే సహకార వ్యవస్థ విస్తరించాలని కోరుకుంటూ..అంతర్జాతీయ సహకార దినోత్సవ, సహకార సంవత్సర శుభాకాంక్షలు.

**– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం(FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th July, 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




**50 ఏళ్ల క్రితం 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన ‘ సోషలిజం, సెక్యులరిజం’ పదాల్ని రాజ్యాంగ పీఠికలో ఉంచాలా? తొలగించాలా?..ఈ వివాదంపై ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఏం చెబుతున్నారు..**

Watch @
https://www.youtube.com/@JPLoksattaOfficial

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.